
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.12.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నోటుపై నోటికొచ్చినట్లు ...



- పెద్ద నోట్ల రద్దుపై స్పష్టత లేని చంద్రబాబు వైఖరి
- ఒకే రోజు రెండు నాల్కల ధోరణి
- సమర్థిస్తే ప్రజల్లో వ్యతిరేకత భయం
- వ్యతిరేకిస్తే కేంద్రంతో కేసుల బెడద


రాజకీయ నాయకులు చొక్కాలు మారుస్తుంటారు. జెండాలను అజెండాలను మారుస్తుంటారని తెలుసు. పార్టీ సిద్ధాంతాలు మారుతాయి. వారి నినాదాలు మారుతాయి. పార్టీలు మారుతాయి. అట్లాగే ఎక్కడి మాట అక్కడ చెప్పుకుంటారు. ఏ ఎండకాగొడుగు పడుతుంటారని తెలుసు. ప్రతి నాయకుడి నోటిలోను నాలుకలు ఒకటి కాకుండా నాలుగైదు ఉంటాయి. సమయానికి తగ్గట్లుగా ఒక్కో నాలుక మాట్లాడుతుంటుందని తెలుసు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు నోట్లో ఎన్ని నాలుకలున్నాయో అంతుబట్టడం లేదు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉదయం చెప్పిన విషయాన్ని రాత్రికి మార్చేయడం రాత్రి చెప్పిన విషయాన్ని ఉదయాన్నే మర్చిపోవడం ఆయనకు మాత్రమే చెల్లినట్లుగా ఉంది.

పెద్ద నోట్ల రద్దు విషయంలో ఆయన వేసినన్ని పిల్లి మొగ్గలు బహుశా ఈ నోట్ల రద్దుకు కారకుడైన మోడీ కూడా వేసి ఉండడేమో. పెద్ద నోట్ల రద్దు వల్ల నష్టం సంభవించిందని తెలిసినా కూడా ప్రధాని తన నిర్ణయాన్ని ఇప్పటికీ సమర్థించుకుంటూ ఇంకా మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశలు కల్పిస్తున్నారు. కానీ చంద్రబాబు మాత్రం పెద్ద నోట్ల రద్దును వ్యతిరేకించాలో సమర్థించాలో తెలియని అయోమయ గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. ఆయన పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లుగా మారింది. పెద్ద నోట్ల రద్దును వ్యతిరేకిస్తే కేంద్రంతో లేని పోని తలనొప్పులు వచ్చి పడుతున్నాయి. ఓటు నోటు కేసు కత్తి వేలాడుతోంది. చంద్రబాబు వ్యతిరేకిస్తే జగన్ దగ్గర అవుతాడని భయం ఒకటుంది.

ప్రధాని నరేంద్రమోడి నవంబర్ 8వ తేదిన పెద్ద నోట్లను రద్దుచేయగానే నేను రాసిన లేఖతోనే మోడీ పెద్ద నోట్లను రద్దు చేశారని చంద్రబాబు తనకుతాను క్రెడిట్ ఇచ్చుకున్నాడు. అవినీతి అంతానికి ఇదొక మార్గంగా అన్నా హజారే లెవల్లో చెప్పుకొచ్చాడు. పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని తద్వారా రాజకీయ లబ్ధిపొందవచ్చని చంద్రబాబు ఆశించాడు. అయితే కొద్ది రోజుల్లోనే నోట్ల రద్దుకు ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో చంద్రబాబు మాటమార్చాడు. నోట్ల రద్దు ప్రక్రియ తనకే అసహనం కలిగిస్తుందని తుఫాన్లని కుడిచేత్తో సునామీలను ఎడమ చేతితో ఆపానని నగదు మార్పిడి విషయంలో కేంద్రం ఫెయిలైందని విమర్శలకు దిగాడు. చంద్రబాబు తీరు గమనించిన కేంద్రం వెంటనే ఆయన మెడకు క్యాష్ ట్రాన్సాక్షన్ కమిటీ కన్వీనర్ పదవిని తగిలించి దీనిపై నోరెత్తకుండా చేసింది. కొద్ది రోజులు ఓపికపట్టిన చంద్రబాబు పెద్ద నోట్ల రద్దు ప్రభావం కేంద్రంలోని బిజెపితో పాటు రాష్ట్రంలో తనప్రభుత్వం మీదకూడా పడుతుందని గ్రహించాడు. అందుకనే మళ్ళీ పాతపాటందుకున్నాడు. తనపార్టీ సమావేశంలో మాత్రం పెద్దనోట్ల రద్దు వ్యవహారాన్ని వ్యతిరేకించాడు. అదేరోజు అధికారుల సమావేశంలో మాత్రం పెద్ద నోట్ల రద్దుకు తానే కారణమన్నాడు. ఇలా పెద్దనోట్ల వ్యవహారంలో చంద్రబాబు వైఖరి పొంతనలేకుండా సాగుతోంది. పెద్ద నోట్ల రద్దును గట్టిగా సమర్థించలేకపోతున్నాడు. అలాగని పూర్తిగా వ్యతిరేకించడం లేదు. ఆయన చివరకు దేనికి కట్టుబడతాడో చూడాలి.

# తలా తోకా లేని ట్విట్టర్ పిట్ట

## ప్రజలకే ప్రశ్నగా మారిన పవన్



ప్రశ్నిస్తానన్నవాడే ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రశ్నగా మారాడు. తప్పుచేస్తే కడిగేస్తానన్నవాడే తప్పటడుగులు వేస్తున్నాడు. నేటి రాష్ట్ర రాజకీయాలలో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అనే ట్విట్టర్ పిట్ట పెద్ద పజిల్‌గా మారింది. ఆయన ప్రశ్నలేంటో ఆ ప్రశ్నలు ఎవరికి సంధిస్తున్నాడో ఆయన ప్రశ్నలకు ఎవరు స్పందించాలో ఎవరికి తెలియనంతగా ఇంకెవరికి అర్థం కానంతగా ఎవరూ అర్థంచేసుకోవాలనే ఆసక్తి లేనంతగా ఉంటున్నాయి. పవన్ వల్ల ఏదో ఒరుగుతుందని ఇంతకాలం ఎదురుచూసిన అభిమానులకు .... (మిగతా 10వ పేజీలో)




# మొదలైన వలసల సీజన్



## గూళ్ళు మారుస్తున్న రాజకీయ పక్షులు

2014 ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో వలసలన్నీ కూడా అధికార తెలుగుదేశం పార్టీలోకి ఉండిపోయాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన నెల నుండే వైకాపా, కాంగ్రెస్ పార్టీల నుండి నేతలు జంపింగ్‌లకు దిగడం తెలిసిందే. నంద్యాల, అరకు ఎంపిలు ఈ వలసలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వైకాపా నుండి 20 మందిదాకా ఎం.ఎల్.ఎ.లు తెలుగుదేశంలోకి వలసపోయారు. వీరిలో కొందరు తెలుగుదేశంకు పాత కాపులే. మరికొందరు కాంగ్రెస్‌లో ఉండి వైకాపాలో ఇమడలేని, లేక ఆర్థిక కారణాలతో పార్టీ మారినవారే. తాజాగా వైకాపా నుండి మరో ఎం.ఎల్.ఎ. ఉప్పులేటి కల్పన కూడా తెలుగుదేశంలోకి జంప్ చేయడానికి సిద్ధపడ్డారు.

అయితే ఇప్పటిదాకా కేవలం టిడిపి వైపే వలసలు సాగాయి. ఇప్పుడిప్పుడే ప్రతిపక్ష వైకాపాలోకి వలసలు ప్రారంభమవుతున్నాయి. గుంటూరు జిల్లా నరసారావుపేట డివిజన్‌లో బలమైన వర్గం ఉన్నటు వంటి కాసు మహేష్ ఇటీవల వైకాపాలో చేరారు. వీరి చేరికతో పలనాడు ఏరియాలో వైకాపాకు కొండంత బలం చేకూరినట్లయింది. అలాగే పశ్చిమ గోదావరిలో కందుల దుర్గేష్ లాంటి నాయకుల చేరికతో పార్టీ బలం పుంజుకుంది. వైకాపాలోకి ఇక ముందు బలమైన వలసలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. కృష్ణాజిల్లాలో ప్రముఖ వ్యాపారవేత్త పివిపి ప్రసాద్‌తోపాటు మరికొందరు కమ్మ సామాజికవర్గ నేతలు కూడా వైకాపాలో చేరడానికి సమాయత్తమవుతున్నట్లు సమాచారం. కర్నూలు, ప్రకాశం, అనంతపురం, నెల్లూరు జిల్లాలలో రెడ్డిసామాజిక వర్గం నుండి ఇంకొందరు బలమైన నాయకులు కూడా వైకాపాలోకి రావచ్చని తెలుస్తోంది. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలను చూస్తే తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో సానుభూతి లేదు. చంద్రబాబు పాలనపై జనం విరక్తి చెందారు. చంద్రబాబుకు మళ్ళీ ఓటేసేందుకు ఎటువంటి బలమైన కారణాలు లేవు. చంద్రబాబుపై ఉన్న వ్యతిరేకత వైకాపాకు అనుకూలంగా మారబోతుందని రాజకీయవాతావరణం సూచిస్తోంది.

# కృష్ణపట్నంలో మరో థర్మల్‌యూనిట్



నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం ఓడరేవు ఆధారంగా ఏర్పాటయిన థర్మల్ కేంద్రాల్లో మరో యూనిట్ విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. ఇప్పటికే జెన్‌కో, థర్మల్ పవర్‌టెక్(సెంబ్‌కార్ప్) వాణిజ్య ఉత్పత్తి చేస్తున్నాయి. తోటపల్లిగూడూరు మండలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న గాయత్రి సెంబ్‌కార్ప్ తొలియూనిట్ 660మెగావాట్ల విద్యుదుత్పత్తిని విజయవంతంగా పరీక్షించారు. వచ్చే ఏడాది త్రైమాసికంలో రెండవ యూనిట్‌ను ఉత్పత్తి దశకు తెచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 1320 మెగావాట్లను సరఫరా చేయాలని నిర్ణయించారు. దీంతో ఆరు థర్మల్ కేంద్రాలు రేవులో చేరినట్లయ్యింది.

### వీధివీధినా వీనులవిందుగా..

## శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు

**- భక్తి శ్రద్ధలతో ప్రారంభమైన నగర సంకీర్తన**

ధనుర్మాసం ప్రారంభం కావడంతో నెల్లూరు నగరంలో వీధివీధినా శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు నగరప్రజలకు వీనులవిందు చేయనున్నాయి. నెల్లూరులోని భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాల సంస్థ ఆధ్వర్యంలో భక్తబృందం జోలె కట్టుకుని భిక్షాటన చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను నిర్వహించేందుకు ఆ సంస్థ కార్యక్రమాలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా, నగరంలోని ప్రధాన వీధుల్లో శ్రీ త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తూ భిక్షాటన చేయడం ఆనవాయితీ. నిర్వాహకుడు యనమండ్ర నాగదేవిప్రసాద్ సారథ్యంలో, శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులు డి. రామచంద్రమూర్తి, అవధానం ప్రసాద్, మల్లికార్జునరావు, బలరామ్, వెంకటేశ్వర రావు, రామకృష్ణ, టి.వి ప్రసాద్, అన్నవరపు సత్యనారాయణలు త్యాగరాజస్వామి సంకీర్తలను గానం చేస్తుండగా, ఆ గానానికి అనువుగా సుహవాద్యాలైన వయోలిన్‌తో వ్యాస్, వనజ, కంజరి వాద్యంతో ఈశ్వరి బాయి, యద్దనపూడి ధనుంజయ, ఇంకా సరస్వతి తదితరులు బృందంగా ఏర్పడి సహకరిస్తున్నారు. ప్రస్తుతం బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ భక్తబృందం నగర సంకీర్తన చేస్తోంది. ఈ ధనుర్మాసం రోజుల్లో తెలతెలవారుతుండగానే నెల్లూరు నగరవీధుల్లో శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలతో పల్లవించడం నెల్లూరు చేసుకున్న అదృష్టం. దాదాపు అర్ధశతాబ్దం క్రితం మహనీయులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, యనమండ్ర వెంకటేశ్వర రావు ఎంతో భక్తితో ఆరంభించిన ఈ కార్యక్రమాలు నేటికీ కొనసాగుతూనే వుండడం వారి సంకల్పబలానికి, నిర్వహణా సామర్థ్యానికి, భక్తిశ్రద్ధలకు ప్రతీక. ఇప్పటికీ అదే ఉత్సాహంతో భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ వారు ఆ కార్యక్రమాలను నిండుమనసుతో కొనసాగిస్తూనే వుండడం విశేషం.

గత వారం రోజులుగా నగరంలోని ప్రధాన వీధుల్లో, ముఖ్యంగా బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో శ్రీ త్యాగరాజస్వామి కృతులను గానం చేస్తూ భక్తబృందంవారు భిక్షాటన చేస్తున్నారు. ఇందుకు నగరవాసులు కూడా ఎంతో భక్తితో వారికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తూ ఆదరిస్తున్నారు. శ్రీ త్యాగరాజస్వామి జయంతి రోజు దాకా ఈ భిక్షాటన, నగర సంకీర్తన కొనసాగిస్తామని, అనంతరం మార్చి 17 నుంచి 23వ తేది వరకు నెల్లూరులోని టౌన్‌హాలులో 52వ భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్వామి స్మరణోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించి, భక్తాదులకు శ్రీ త్యాగరాజస్వామి భక్తితత్వాన్ని, సంకీర్తనామృతాన్ని పంచిపెట్టేవిధంగా ఎంతోమంది ప్రముఖ సంగీతజ్ఞులను ఈ ఉత్సవాలకు ఆహ్వానించి, వారిచే సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు డా.నాగదేవి ప్రసాద్ తెలియజేశారు.

## హ్యాండ్‌బాల్ పోటీల్లో నెల్లూరు ఘనవిజయం

ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో నెల్లూరు బాలికల జట్టు సత్తా చాటింది. సైదాపురం ఉన్నతపాఠశాల విద్యార్థిని రూపకౌసల్య ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును విజయపథానికి చేర్చింది. ఫైనల్స్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో పోటీపడి నెల్లూరుజట్టు ఘన విజయం సాధించింది. దీంతో ఈ జట్టు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించినట్లయింది. ఈ జట్టులో సైదాపురం క్రీడాకారిణులు రూపకౌసల్యతో పాటు, లలిత, తస్లీం, నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ జట్టును పి.డి లక్ష్మీనారాయణ అభినందిస్తూ, వచ్చే నెల 2 నుంచి 8వ తేది వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొననుందని తెలిపారు.

## నెల్లూరు ఏసిపి బదిలీ

నెల్లూరు నగర పాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మహాలక్ష్మీదొరను విజయవాడ మెట్రోపాలిటి నగరపాలక సంస్థ డిప్యూటి సిటీ ప్లానింగ్ అధికారిగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. కొన్ని నెలల క్రితమే ఆమెను నెల్లూరులో ఆక్రమణలు తొలగించేందుకు విజయవాడ నుంచి తీసుకువచ్చారు. ఆక్రమణల పని పూర్తికాకుండానే మళ్ళీ విజయవాడకు పంపారు.

# ఇదే ఆఖరి వారం

### ఈ ఏడాది ముగింపుతోనైనా నోట్ల కష్టాలు ముగుస్తాయా?

*50 రోజులు.... 7 వారాలు*

*పాత నోట్ల రద్దుకు..కొత్త నోట్ల కష్టాలకు తీసుకున్న సమయం.*

*ఈ నోట్ల కష్టాలకు ఇంకో వారం మాత్రమే గడువుంది.*

*ఇదే ఆఖరువారం*




డిసెంబరు 30వ తేదితో నోట్ల రద్దు గడుస్తుంది. 31వ తేదితో ప్రజలను కష్టాల పాలుచేసిన 2016 సంవత్సరం కూడా పోతుంది. 2017 వ సంవత్సరం ఆరంభంలో ఏమి జరుగుతుందనే దానిపై లోక మంతా కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత నవంబరు 9 నుంచి బ్యాంక్‌ల ముందు, ఏటిఎం ల ముందు నగదు మార్పిడి కోసం క్యూలు మొదలయ్యాయి. క్యూలు ఆరోజు ఎలా వున్నాయో.. ఈ రోజుకీ అలాగే వున్నాయి. క్యూ లలో జనం ఏమాత్రం తగ్గడం లేదు. ఇక పాత పెద్దనోట్లు బ్యాంక్ లలో దాదాపు డిపాజిట్ అయి పోయాయి. ఇక చాలా తక్కువ మొత్తాలలో మాత్రమే పాతనోట్లు మిగిలుండే అవకాశం వుంది. దానికితోడు ఇప్పుడు ఆర్‌బిఐ కొత్త షరతు తెచ్చింది. 5వేలకు మించిన నగదైతే అకౌంట్‌లో ఒక్కసారి మాత్రమే డిపాజిట్ చేయాలనే నిబంధన పెట్టారు. దీంతో మిగిలిన పాత నోట్లు కూడా పూర్తిగా బ్యాంక్ లకు చేరే అవకాశం వుంది. ఇక వారం రోజులు ఓపిక పడితే 30వ తేది వస్తుంది. ఆ తర్వాత ఏమవు తుందో..వేచిచూద్దాం!

## తాను లేకున్నా..నలుగురి జీవితాల్లో వెలుగు నింపి..

అవయవదానం..గొప్పదానం. తాను లేకున్నా..మరెందరి జీవితాలకో వెలుగును ప్రసాదించే మహోన్నతమైన కార్యమది. తాను మరణించినా..పలువురిలో జీవించే మహత్తరమైన వరమది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవజీవితాన్ని ధన్యం చేసే పరోపకారమిది. అంతటి మహత్కార్యాన్ని ఓ మహిళ ఆచరించి .. తన జీవితాన్ని సార్థకం చేసుకుంది.

ఆమె పేరు మల్లి చెంగమ్మ. ఊరు.. చిట్టమూరు. ఆమెది నిరుపేద కుటుంబం. పిల్లల చదువుల కోసం..కుటుంబపోషణ కోసం ఆమె నిరంతరం కష్టపడుతుండేది. మల్లాంలోని ఓ ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో ఆయాగా పనిచేస్తున్న చెంగమ్మకు ఒక కుమారుడు ఒక కుమార్తె వున్నారు. కుమారుడు బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తెకు ఇటీవల వివాహమైంది. ఈ నెల 12న అల్లుడు, కుమారుడితో ఆమె మోటార్‌బైక్‌పై వస్తుండగా విధి 'వర్ధా' తుఫాన్ రూపంలో చుట్టుముట్టింది. విసురుగా వీచిన గాలిదెబ్బకు వెనుకసీట్లో చివరన కూర్చునివున్న చెంగమ్మ ఒక్క ఉదుటున కిందపడిపోయింది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో చెంగమ్మ తలకు తీవ్ర గాయం కాగా, వెంటనే కుటుంబసభ్యులు నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ఐసియూలో చికిత్స పొందుతున్నా చెంగమ్మ కోలుకోలేకపోయింది. 16వ తేది ఆమెకు బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. చెంగమ్మ కుటుంబం శోక సాగరంలో మునిగిపోయింది. అయిన ప్పటికీ, గుండె నిబ్బరం చేసుకుని గ్రామపెద్ద కిశోర్‌నాయుడు ప్రోత్సాహంతో ఆమె కుమారుడు ప్రసన్నకుమార్, తమ తండ్రి



చెంచుకృష్ణయ్యను తన తల్లి అవయవదానానికి నచ్చజెప్పి ఒప్పించాడు. అవయవదానానికి రక్తసంబంధీకులు అంగీకరించడంతో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యబృందం చెంగమ్మకు శస్త్రచికిత్స చేసి అవయవాలను సేకరించారు. వెంటనే వాటిని ప్రత్యేక వాహనాల్లో చెన్నై, విశాఖ, తిరుపతి ఆసుపత్రులకు తరలించారు. గుండెను చెన్నైలోని ఫోర్టిస్‌మలార ఆసుపత్రికి, లివర్‌ను విశాఖలోని అపోలో ఆసుపత్రికి, ఒక కిడ్నీని తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. మరో కిడ్నీని కిమ్స్ ఆసుపత్రిలోనే చికిత్సపొందుతున్న మరో రోగికి అమర్చారు. చెంగమ్మ నేత్రాలను మోదరన్ కంటి ఆసుపత్రికి తరలించారు. మొత్తం ఆరుగురు రోగుల జీవితాలకు ఈ అవయవదానంతో వెలుగులు వచ్చినట్లయింది.

**- స్ఫూర్తిదాయకం..చెంగమ్మ జీవితం**

తన తల్లి లేకపోయినా, ఆమె అవయవదానంతో మరో ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపడం, అలాంటి మానవతా హృదయురాలైన తనతల్లికి పుత్రునిగా జన్మించడం తనకు గర్వంగా వుందని ప్రసన్న ఈ సందర్భంగా కన్నీళ్ళతో చెప్పాడు. ఈ సందర్భంగా మల్లి చెంగమ్మ త్యాగాన్ని, వారి కుటుంబసభ్యుల ఔదార్యాన్ని అందరూ కొనియాడారు. పల్లెల్లోనూ అవయవదానం ప్రాముఖ్యత ఎంతగా ప్రజలను చైతన్యవంతం చేస్తోందో ..తాము లేకున్నా మరికొంతమంది జీవితాలకు వెలుగులు ప్రసాదించాలనే మానవతా స్ఫూర్తిదీప్తులు ఎంతగా వికసిస్తున్నాయో... ఈ సంఘటనే ఒక తాజా ఉదాహరణ. ఏదేమైనా, తాను మరణించినా..అవయవదానంతో పలువురి జీవితాల్లో జీవిస్తున్న మల్లి చెంగమ్మ.. ధన్యురాలు. అవయవదానంతో పునీతమైన ఆమె జీవితం సార్థకం. మానవతా పరిమళాలు గుభాళించిన ఆ 'మల్లి' జీవితం.. అందరికీ స్ఫూర్తిదాయకం.

# ఉచితంగా బ్యాంక్ బ్యాలెన్స్ తెలుసుకోవచ్చు

పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో కొన్ని బ్యాంక్ శాఖలు ఉచితంగానే బ్యాంక్ బ్యాలెన్స్ తెలుసుకునే వెసులుబాటును ఖాతాదారులకు కల్పించాయి. బ్యాంక్‌లలో తమ నగదు వివరాలు తెలుసుకోవాలన్నా గంటల తరబడి నిలుచోవాల్సిన పరిస్థితులు వుండడంతో, బ్యాంక్ బ్యాలెన్స్ ఎంత వుందో ఖాతాదారులు తెలుసుకునేందుకు వీలుగా ఈ వెసులుబాటు కల్పిస్తూ పలు బ్యాంక్‌లు ఈ ఏర్పాటుచేశాయి. సెల్‌ఫోన్‌తో ఒక్క మిస్డ్ కాల్ ఇస్తే చాలు మన ఖాతాలో ఎంత సొమ్ము నిల్వ వుందో ఇట్టే తెలిసిపోతుంది. జిల్లాలో 41 బ్యాంక్‌లు, 418 బ్యాంక్ శాఖలు వున్నాయి. ఖాతాదారులు సుమారు పాతిక లక్షలమంది దాకా వున్నారు. వీరిలో సుమారు 15 లక్షల మందికి ఏటిఎం కార్డులు వున్నాయి. బ్యాంక్ ఖాతాదారులు తమ ఖాతాలోని నగదు నిల్వ తెలుసు కోవాలంటే వారి నంబర్ బ్యాంక్ ఖాతాతో అనుసంధానమై వుండాలి. అలాంటివారు ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఎలాంటి రుసుము లేకుండానే బ్యాంక్‌లు ఈ సదుపాయాన్ని కల్పిస్తు న్నాయి. ఈ మిస్డ్ కాల్ సౌకర్యం కోసం ఒక్కో బ్యాంక్ ఒక్కో నెంబర్‌ను కేటాయించింది. ఏ బ్యాంక్‌లో ఖాతా వుంటే ఆ బ్యాంక్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా తమ ఖాతాలోని నగదు నిల్వ సమాచారం పొందే వీలుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా : 09223 766666, ఆంధ్రా బ్యాంక్ : 09223 011300, సిండికేట్ బ్యాంక్ : 09241 442255, యూనియన్ బ్యాంక్ : 09223 008586, కరూర్ వైశ్యాబ్యాంక్ : 09266 292666, కెనరా బ్యాంక్ : 09015 483483, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా : 09222 250000, బ్యాంక్ ఆఫ్ బరోడా : 09223 011311.

## ఆనందోత్సాల మధ్య
# జగన్ జన్మదినోత్సవం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. జిల్లా వైఎస్సార్సీపి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంతోషం వెల్లడించారు. జగన్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని రాజన్నభవన్‌లో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలసి నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా, సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో 786 కార్యాలయం వద్ద వైఎస్సార్సీపి పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ






కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ద్వారా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉదయగిరిలో వైఎస్సార్సీపి నాయకుడు మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌ను కట్ చేసి ఘనంగా వేడుక చేశారు. గూడూరులో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. కావలిలోని వైఎస్సార్సీపి కార్యాలయంలో జగన్ జన్మదినోత్సవ వేడుకల కార్యక్రమం జరిగింది. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ, పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. వెంకటగిరిలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్సీపి నాయకులు ఢిల్లీబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసదన్‌లోని అనాథ చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు.

# పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు





పోలీస్ కానిస్టేబుల్స్, జైలు వార్డెన్‌ల ఉద్యోగ ఎంపికలకు పోలీసుపెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు ఎంతో పటిష్టవంతంగా జరుగుతున్నాయి. జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ పర్యవేక్షణలో ఈ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా జరిగాయి. వందలాది మంది అభ్యర్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణ విధుల్లో వున్న పోలీసు సిబ్బంది అభ్యర్థుల పత్రాలను ఆమూలాగ్రం పరిశీలించి అనుమతించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పరిశీలించారు. అనంతరం దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులను అనుమతించారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పటిష్టమైన సిసి కెమెరాల నిఘా కళ్ళతో ఈ పరీక్షలు నిర్వహించడం విశేషం. ఆ తర్వాత పరుగు పందెం నిర్వహించారు. అభ్యర్థుల పరుగు సమయాన్ని ఖచ్చితంగా గుర్తించడం కోసం, పరుగు పందెం సమయంలో అభ్యర్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో రేడియో ఫ్రీక్వెన్సీ డివైజ్ చిప్ అమర్చి దాని సాయంతో ఖచ్చితమైన సమయాన్ని గుర్తించారు. ఇలా అడుగడుగునా సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని అర్హతలను పకడ్బందీగా గుర్తించి ఎంతో పారదర్శకంగా పోలీసుశాఖ ఈ పరీక్షలు నిర్వహిస్తోంది. ఎంతోకాలం తర్వాత పోలీసుశాఖలో కానిస్టేబుళ్ళ భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నిరుద్యోగ యువత పోటాపోటీగా ముందుకు వచ్చి ఈ పరీక్షలకు హాజరయ్యారు.

# మంటల్లో డి.యస్.ఓ. కార్యాలయం

నెల్లూరులోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి పాత రికార్డులన్నీ కాలిపోయాయి. మంగళవారం వేకువన జరిగిన ఈ ప్రమాదాన్ని గమనించినవారు అధికారులకు సమాచారం అందించారని, అప్పటికే కార్యాలయం గోడలు కూడా బాగా కాలిపోయాయని అధికారవర్గాల సమాచారం. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రెండు ఫైరింజన్లతో దాదాపు ఆరుగంటల పాటు కష్టపడి ఆ మంటలను ఆర్పాల్సివచ్చింది గదుల గోడలను పగులగొట్టి మంటలను అదుపులోకి తీసుకురావాల్సివచ్చింది. ఈ ప్రమాదంలో పాత రికార్డులు, ఈ-పాస్ రశీదులు, పాత రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వగైరాలు మంటల్లో కాలిపోయివుంటాయని భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జేసి-2 రాజ్‌కుమార్, ఇన్‌ఛార్జి డిఎస్ఓ కనకనరసారెడ్డి, నెల్లూరు డిఆర్ఓ తదితరులంతా వచ్చి పరిశీలించారు. పౌరసరఫరాలశాఖ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాలిపోయిన భవనం పనికిరాదని తేలడంతో, పాత జడ్పీ ఆఫీసులో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుచేస్తున్నారు. కాగా, అగ్నిప్రమాదం వల్ల అనేక సంవత్సరాల నుంచి నిల్వచేసిన ఆధార్, రేషన్‌కార్డుల ధరఖాస్తులు, ఇతర రికార్డులు దగ్ధమయ్యాయని, అయితే బీరువాల్లో భద్రపరచిన సిఎంఆర్ రికార్డులు పదిలంగానే వున్నాయని అధికారులు చెప్తున్నారు. అయితే, ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా లేక కావాలనే ఎవరైనా ఈ ప్రమాదం సృష్టించారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. చుట్టూ భద్రత వున్న అధికార భవనంలో ఇంతటి భారీ అగ్నిప్రమాదం ఎలా జరిగి వుంటుందనే విషయంపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలోని అవినీతి ప్రహసనాలు బయటపడకుండా కప్పిపుచ్చుకునేందుకు ఎవరైనా కావాలనే ఈ ప్రమాదం సృష్టించారా అనే అనుమానాలూ లేకపోలేదు. ప్రమాదానికి గల అసలు కారణాలు తెలియాల్సి వుంది.

# ఆయన తెలుగు 'వైద్యరత్నం'




తమిళనాడు తెలుగు వైద్య తేజంగా విరాజిల్లుతూ, అక్కడి తెలుగువారికి అన్నగా దన్నుగా ఉంటూ, తన సొంతగడ్డ నెల్లూరు నుండి వైద్య చికిత్స నిమిత్తం ఎవరు చెన్నైకు వెళ్లినా నేనున్నానంటూ అభయమిచ్చి ఆదుకుంటున్న నెల్లూరీయుడు, తమిళనాడులోని తెలుగు ప్రజల ఆశాకిరణం డాక్టర్ సి.ఎం.కె.రెడ్డికి మరో విశిష్ట అవార్డు లభించింది. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా(ఏఎఫ్ఏ) 14వ తేదీ చెన్నై తేనాంపేటలోని కామరాజర్ ఆరంగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 9మంది వ్యక్తులను అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో చేసిన సుదీర్ఘ కాల సేవలకుగాను డాక్టర్ సిఎంకె రెడ్డిని 'వైద్యరత్న' అవార్డుతో సత్కరించారు. ఏపి శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి, మహానటి సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరిలు అతిథులుగా హాజరై ఆయనను సత్కరించారు. ప్రతిష్టాత్మకమైన అక్కినేని అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ సి.ఎం.కెకు 'లాయర్' శుభాకాంక్షలు.

# 'శుభమస్తు'లో బంపర్ డ్రా



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్‌మాల్ వారు క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా లక్షణంగా పండుగలు, లగ్జరీగా కార్లు పేరుతో ఖాతాదారులకు ప్రత్యేక స్కీమ్ ప్రకటించారు. ప్రతి ఆదివారం లక్కీ డ్రా ద్వారా ఒక విజేతకు నానో కారు, ప్రతిరోజూ లక్కీ డ్రా ద్వారా ఒకరికి పట్టు చీర బహుమతిగా ఇస్తున్నారు. ఈ స్కీమ్‌కు ఖాతాదారుల నుంచి కూడా విశేష స్పందన కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీన షాపింగ్‌మాల్‌లో నిర్వహించిన మొదటి లక్కీ డ్రాకు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ముఖ్యఅతిథిగా హాజరై లక్కీ డిప్‌ను నిర్వహించారు. ఈ డ్రాలో నెల్లూరుకు చెందిన జి.బలరామ్ నానో కారును, లీలావతి అనే మహిళ పట్టుచీరను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు మేయర్ అజీజ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శుభమస్తు అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ పాల్గొన్నారు.

---





# ప్రకృతి పరిమళాల చిరునామా ఎస్.ఫ్లోరా

నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని ఎస్.ఆర్.కె. స్కూల్ ఎదురుగా, వివిధ రకాల ఇంటర్నల్ ట్రీ ప్లాంట్స్‌తో ఎన్నో ఆకర్షణీయమైన పూల బొకేలతో సుగంధద్రవ్యాలతో కూడిన దండలతో ఎంతో అందంగా రూపుదిద్దుకున్న ఎస్.ఫ్లోరా షోరూమ్‌ను ఈ నెల 21వ తేదీన శాసన మండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమములో ఎం.ఎల్.సి. బీద రవిచంద్ర, నెల్లూరు గ్రామీణ ఎం.ఎల్.ఎ. కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర ఎం.ఎల్.ఎ. పి. అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎం.ఎల్.ఎ. ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాజీ మంత్రి టి. రమేష్ రెడ్డి, పెద్దాసుపత్రి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహరావు, టి.డి.పి. జిల్లా అధికార ప్రతినిధి డా॥ జడ్. శివప్రసాద్, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కార్పొరేటర్లు దాసరి రాజేష్ నూనె మల్లికార్జున యాదవ్, పిట్టి సత్యనాగేశ్వర రావు, మేకల రజని తదితరులు పాల్గొన్నారు. షోరూమ్ అధినేతలు వై. వెంకటేశ్వర్లు, ప్రపంచ యోగా ఛాంపియన్ వై. జ్యోష్ణవిలు అతిథులకు స్వాగతం పలికి సుగంధద్రవ్యాల దండలతో సత్కరించారు.

# 'ప్రభా'తం

**త**మ ఘాతుకాలతో ఎందరి కుత్తుకలు కోశారో..ఎన్ని కుటుంబాల కన్నీళ్ళతో వారి నెత్తుటిదాహం తీర్చుకున్నారో..ఎంతెంతమంది అమాయకుల ప్రాణాలు బలితీసుకుని వికటాట్టహాసాలు చేస్తున్నారో!..వీరి దారుణ మారణకాండలకు ఎన్నో కుటుంబాలు నిత్యశోకంతో..తీరని వేదనతో కుమిలిపోతూనే వున్నాయి. అలాంటి ఉగ్రభూతాలకు గుణపాఠంగా, బాధితులకు ఊరటనిచ్చేవిధంగా న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పు ఎంతో చరిత్రాత్మకమైనది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో సుమారు మూడేళ్ల క్రితం బాంబు పేలుళ్ళ ఘటనతో అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాద ముష్కరులకు ప్రత్యేకన్యాయస్థానం మరణదండన విధించింది. తద్వారా న్యాయదేవత తన విశిష్టతను మరోసారి చాటుకుంది. మానవత్వానికి శత్రువుగా మారి, శాంతికి విఘాతం కలిగిస్తూ..అనేకమంది అమాయకుల ప్రాణాలను హరిస్తూ దేశంలో హింసలతో ధ్వంసరచన గావిస్తున్న ఉగ్రరాకాసులకు ఈ తీర్పు గుణపాఠమని చెప్పక తప్పదు. విధ్వంసాలు, ఘాతుకాలతో అమాయకుల ఉసురుతీసే ఉగ్రవాద ఘాతుకులకు సరైన శిక్షే పడిందన్న అభిప్రాయం సర్వత్రా వెల్లడవుతోంది. భారత్‌లో మారణహోమాలు సృష్టించి నెత్తురుటేరులు పారించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్న ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) కు చెందిన ఉగ్రవాదులకు ఉరిశిక్షే సరైనదని ప్రత్యేక కోర్టు నిర్ధారించడంతో, ఆ ముష్కరుల అమానుషాలకు బలైనవారి కుటుంబాలకు కాస్తంత ఊరట కలిగించింది. 2013 ఫిబ్రవరి 1వ తేదిన దిల్‌సుఖ్‌నగర్‌లో పేలిన బాంబుపేలుళ్ళు ఒక నిండుచూలాలి కడుపులోని శిశువుతో సహా 18 మంది ప్రాణాలను బలిగొన్నాయి. ఈ ఘోరదుర్ఘటనలో మరో 131 మంది అమాయకులు గాయాలతో విలవిలలాడిపోయారు. ఈ విషాదానికి దేశం చలించిపోయింది. ఈ మారణహోమం సృష్టించిన ఆ అయిదుగురు ముష్కరులకు కోర్టు ఉరిశిక్షలను ఖరారు చేసింది. ఆ మేరకు చర్లపల్లి కేంద్ర కారాగారం లోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఈ తీర్పును వెలువరించింది.

## ఉగ్రరక్కసికి ఉరే సరి!



హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లో సుమారు మూడేళ్ళ క్రితం బాంబు పేలుళ్ళతో 19 మంది ప్రాణాలు బలిగొన్న ఉగ్ర రక్కసులకు ఉరిశిక్షలు పడడం ఉగ్రవాదమూకలకు సరైన గుణపాఠం. ప్రత్యేకన్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు బాధిత కుటుంబాలకు కొంతమేరకు ఊరటనిచ్చేదే. అయినా, అమాయక ప్రజల ప్రాణాలు తీసే ఉగ్రభూతాల దారుణాలకు కఠినదండనలే తప్పనిసరి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేస్తే తప్ప ప్రజలకు శాంతి వుండదు..శాంతియుత భారత్‌కు మనశ్శాంతి వుండదు.

ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులు వుండగా, ప్రధాన సూత్రధారి రియాజ్ భత్కల్ మాత్రం పరారీలో వున్నాడు. పాక్‌లో తలదాచుకున్న రియాజ్ భత్కల్ ఆదేశాల మేరకు ఉగ్రవాదులు 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లకు పాల్పడ్డారని ఎన్ఐఏ తన దర్యాప్తులో పేర్కొంది. మొత్తం ఆరుగురు ఉగ్రవాదుల్లో అయిదుగురికి ఉరిశిక్ష పడగా, కరడుగట్టిన ఉగ్రవాది రియాజ్ భత్కల్‌పై ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసింది. ఈ జంటపేలుళ్లకు మూల కారకుడైన రియాజ్ భత్కల్ పరారీలో వున్నాడని, బహుశా పాక్‌లోనే అతను తలదాచుకుని వుంటాడని భావిస్తున్నారు. గతంలో భారత పార్లమెంట్ మీద దాడి చేసిన కేసులో అఫ్జల్‌గురు ఉరితీతకు ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్తాన్‌లో నక్కి వున్న ఉగ్రముష్కరులు పదేపదే ప్రకటించివున్న నేపథ్యంలో, ఆ తరువాత కొద్దికాలానికే దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్ళు జరగడం అందరికీ తెలిసిందే. ఈ దారుణాలకు మూలకారణం ఐఎం ఉగ్రవాద సంస్థే. 2006లో వారణాసిలోను, ముంబైలోనూ వరుస పేలుళ్ళతో అది దేశాన్ని అల్ల కల్లోలం చేసింది. 2007లో హైదరాబాద్‌లోని గోకుల్‌చాట్, లుంబినీ పార్కులలో జరిగిన ఘాతుకాలు కూడా ఐఎం ఉగ్రవాదమూకలవే. అంతేకాదు, 2008లో జైపూర్‌లోను, అహ్మదాబాద్‌లోను, ఢిల్లీలోనూ మారణహోమాలు సృష్టించింది. 2010లో పుణే లోను, బెంగళూరు, మళ్ళీ ఢిల్లీ–వారణాసిల్లోనూ ఉగ్ర కోరలు సాచి ఎందరో అమాయకుల ప్రాణాలు తీసింది కూడా ఈ ఉగ్రవాద సంస్థే. 2011లో మరోసారి ముంబైలోను, 2012లో పుణేలోనూ ఐఎం ఘాతుకాలు మరెంతో ఘోరమైనవి. ఇలాంటి ఉగ్రవాదమూకలకు ఆశ్రయమిచ్చి ప్రోత్సహిస్తున్నది పాకిస్తానేనని ప్రత్యేకించాల్సిన అవసరం లేదు. అలాంటి ఉగ్రరాక్షసులకు ఇప్పుడు ఈ కేసులో సరైన శిక్ష పడడం జరిగింది. ఈ కేసులో ప్రత్యేకించి ఎన్ఐఏ అధికారులు, వారి సిబ్బంది, దర్యాప్తు బృందం అంతా సమిష్టిగా పనిచేయడం వారి దీక్షాదక్షతలకు నిదర్శనమనే అనవచ్చు. అధికారుల నిరంతర కృషి వల్లే దిల్‌సుఖ్‌నగర్‌లో దాడులు చేసిన ఉగ్రముష్కరులకు కఠినదండన విధించడం సాధ్యమైందనే అనుకోవచ్చు. ఈ కేసుకు సంబంధించి 459 మంది సాక్షులను విచారించడం, 152 డాక్యుమెంట్లు పరిశీలించడం, దాదాపు 200 ఆధా రాలను సేకరించడమంటే మాటలు కాదు. వీటి వెనుక ఎంతో కృషి, వుంది. న్యాయస్థానానికి సమగ్రమైన దర్యాప్తు నివేదికను అందించడంలో ఎన్ఐఏ చేసిన బృహత్తరప్రయత్నం ఎంతైనా మెచ్చుకోదగ్గది.

అయినా, ఉగ్రవాదమన్నది అంత సులభంగా సమసిపోయేది కాదు. నెత్తురు రుచిమరిగిన ఉగ్రవాద రక్కసి ఎల్లవేళలా పొంచి వుంటూనే వుంటుంది. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడల్లా తన కోరలు చాస్తూనే వుంటుంది. నిఘా సంస్థలు క్షణం కూడా ఏమరుపాటు లేకుండా పనిచేయడమే కాక ప్రజలు కూడా ఎల్లవేళలా ఇలాంటి ముష్కరుల పట్ల అప్ర మత్తంగా వుండాలి. శాంతికి సహనానికి ఆలవాలమైన మన భారతదేశంలో దారుణ మారణకాండలు సాగించే ఉగ్రవాద రక్కసికి ఎలాంటి చిన్న అవకాశం కూడా ఇవ్వకుండా అందరూ అప్ర మత్తం కావాలి. అచంచలమైన దేశభక్తితోనే ఇలాంటి ఉగ్రవాద మూకలను తరిమికొట్టడం సాధ్యమవుతుంది. ఉగ్రవాదాన్ని తుదకంటా తుదముట్టించేందుకు అందరూ సమాయత్తమైనప్పుడే ఉగ్రరక్కసి వికృతకృత్యాలు సమసిపోతాయి. అందుకు ప్రభుత్వాలు–ప్రజలు అందరూ కలసికట్టుగా కృషి చేయాలి. శాంతియుతమైన మనదేశాన్ని ఉగ్రవాదభూతాన్నుంచి రక్షించుకోవాలి. ప్రత్యేకించి ఈ తీర్పు ఉగ్రరాకాసులకు గుణపాఠం కావాలి. అయితే, నిబం ధనల ప్రకారం ప్రత్యేక న్యాయస్థానం విధించిన ఉరిశిక్షను హైకోర్టు ఖరారు చేయాల్సివుంటుంది. అయినా, ఉన్నత న్యాయస్థానాల్లోనూ ఈ కేసు త్వరలోనే ఒక కొలిక్కివస్తుందని భావిద్దాం!..ఉగ్రభూతాలకు కఠినశిక్షలు ఖరారు కావాలని ఆశిద్దాం!..

## గోదాదేవికి ఊంజల్‌సేవ

ధనుర్మాస దీపారాధనను పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలో వున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈ నెల 17వ తేది రాత్రి గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి కన్నులపండువగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీమాన్ శ్రీనివాస అయ్యంగార్ పాల్గొని తిరుప్పావై పాశురాలను ప్రవచించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజర్ గిరికృష్ణ తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## కవులు, రచయితలు సమాజ మార్గదర్శకులు

**– వివిఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య**

కవులు, రచయితలు సమాజ మార్గదర్శకులని నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య అన్నారు. ఈ నెల 17వ తేదీన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని స్మారకభవనంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని దూరదృష్టితో ఆలోచించి సమాజహితం కోసం వారి రచనలు ద్వారా మేల్కొలిపే కవులు, రచయితలు, కళాకారులకు కీర్తి పురస్కారాలను తన చేతులమీదుగా అందజేయడం ఆనందదాయకమన్నారు. అనంతరం కీర్తి పురస్కారాలను గానుగపెంట హనుమంతరావు, డా॥ ఊసల రజనీగంగాధర్, డా॥ అనుగోలు సంజీవరాయుడు, జెఎస్ఎస్ బ్రహ్మానందచారి, ఎస్‌వి.రఘువీర్ ప్రతాప్, ఉన్నం వెంకటేశ్వర్లు, దుబ్బల దాసు, యస్.అగస్టీన్ అమర్, కె.యం.బాలరాజు, వడలి రాధాకృష్ణ, బి.షఫీవుల్లా, హస్తి మోహన్‌రాజు, బుర్రి పుల్లారావు, పూర్ణచంద్రరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెట్నెల్ సిఇఓ డా॥ సి.సుబ్రహ్మణ్యం, సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, అందె శ్రీనివాసులు, భావతరంగిణి పత్రికా సంపాదకుడు భవిష్య తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంక్‌లో పదోన్నతులు

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో పదిమంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సోమవారం 20 మంది బ్యాంక్‌అధికారులు, సిబ్బందికి మౌఖిక పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో అర్హత సాధించినవారిలో ఒకరికి ఏజిఎంగా, నలుగురికి మేనేజర్లుగా, అయిదుగురికి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డితోపాటు బ్యాంకు డైరెక్టర్లు కూడా పాల్గొన్నారు.




## కార్పొరేట్ సంస్థలను జాతీయం చేయండి

పెద్దనోట్ల రద్దు వల్ల ప్రజలకు మంచికంటే చెడే ఎక్కువగా జరుగుతుందని అర్ధమైపోయింది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు రూపాయి, రూపాయి కూడబెట్టుకుని దాచుకున్న సొమ్మును కూడా ప్రభుత్వం నల్లధనం క్రింద జమకడుతోంది. ప్రజలు తమ అవసరాలను త్యాగం చేసి డబ్బులు పొదుపు చేస్తారు. ఎందుకంటే ఇక్కడ భవిష్యత్ ఎలా ఉంటుందో తెలియదు. రోగమొస్తే లక్షల్లో ఖర్చు... పిల్లల చదువుల కోసం లక్షలు పోయాలి... మధ్యతరగతి ప్రజలు ఒక పూట తిని, ఇంకో పూట మానుకుంటే గాని పిల్లల చదువులకు, ఆసుపత్రుల ఖర్చులకు డబ్బులు కూడబెట్టలేరు. ఇప్పుడు వాళ్ల డబ్బులు బ్యాంకులో జమ చేశారు. తమ పిల్లాడికి ఇంజనీరింగ్ సీటు కావాలంటే 10లక్షలు కావాలి, మరి మధ్యతరగతి ప్రజలు ఎక్కడనుండి తీసుకురావాలి. ప్రధాని నరేంద్ర మోడీకి దమ్ముంటే దేశంలో వున్న అన్ని కార్పొరేట్ విద్య, వైద్య సంస్థలను జాతీయం చేయాలి. లక్షల ఖర్చు కాకుండా అన్ని వర్గాల ప్రజలకు విద్య, వైద్య సదుపాయాలు అందించాలి. ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసినట్లు మోడీ కూడా పేద, మధ్య తరగతి ప్రజల నుండి కోట్లు కొల్లగొడుతున్న కార్పొరేట్ విద్య, వైద్య సంస్థలను జాతీయం చేస్తే చరిత్రలో నిలిచిపోతాడు.

**బి.ఉమామహేశ్వరరెడ్డి, నెల్లూరు.**

## కఠినంగా శిక్షించాలి

ఓ పక్క పేదలు, వృద్ధులు, మహిళలు రెండు వేలు, నాలుగు వేల రూపాయల కోసం గంటల తరబడి క్యూలలో నిలుచుంటున్నారు. ఈ 'క్యూ'లలో నిలబడే చాలామంది చచ్చిపోయారు. ఇంకోపక్క బడాబాబుల ఇళ్లలో రెండువేల నోట్ల కట్టలు కట్టలు కట్టలుగా బయటపడుతున్నాయి. ఇవన్నీ కూడా ప్రభుత్వ నేతలు, బ్యాంకు అధికారుల కుమ్మక్కుతో వచ్చినవే! ఈ నోట్లు ఎలా బయటకు వెళ్లాయన్నదానిపై సిబిఐ విచారణ చేపట్టాలి. దోషులకు శిక్ష విధించాలి. లేదంటే ప్రధాని మోడీ నిజాయితీని శంకించకతప్పదు.

**జి.వి.శంకర్, నెల్లూరు.**

## క్యాష్‌లెస్ సాధ్యమేనా?

ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాలలోనే ఇంకా పూర్తి స్థాయి నగదు రహిత లావాదేవీలు అమలు కావడం లేదు. అలాంటిది భారతదేశంలో ఒక్కసారిగా నగదు రహిత లావాదేవీలంటే అమలు సాధ్యమేనా? దేశంలో నిరక్షరాస్యులెక్కువ. చిన్నవ్యాపారులెక్కువ. నగదు ఆధారిత వ్యాపారాలెక్కువ. భారీ మొత్తంలో వుండే లావాదేవీలను చెక్‌లు, కార్డుల ద్వారా నిర్వహించడం సబబే! చిల్లర వ్యాపారాలకు కూడా కార్డులు, చెక్కులు, స్వైపింగ్ మిషన్‌లు అంటే ఎలా?

**గండి మనోహర్, ఓజిలి.**

## ఉచిత పథకాలను ఎత్తివేయాలి

ప్రభుత్వాలు మనుషుల్ని సోమరిపోతుల్ని చేస్తున్నాయి. ఓట్ల కోసం తాత్కాలిక ప్రయోజనాలిచ్చే పథకాలకే పెద్దపీట వేస్తున్నాయి. శిశువు నుంచి పెద్దల వరకు, పెళ్ళి నుంచి ప్రసవం వరకు ఎన్నో స్కీమ్‌లు ప్రకటిస్తున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వమైతే సిగ్గులేకుండా చుక్క, సారా వంటి పథకాలను కూడా పెడుతోంది. ప్రజలకు శాశ్వతంగా ఉపాధి చూపించండి. ప్రతి చేనుకు నీరు, కరెంట్ ప్రతి ఒక్కరికి ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటివి కల్పిస్తే చాలు. ఇతర తాయిలాలు అక్కరలేదు. క్రిస్‌మస్, రంజాన్, సంక్రాంతి పండుగలకు కానుకల పేరుతో ఇస్తున్న నిత్యావసర సరుకులు పెద్ద దండగ. దీనివల్ల ప్రభుత్వాదాయానికి గండిపడడం తప్పితే ప్రయోజనం లేదు.

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు**

# అంతా 'స్మార్ట్' మాయ!

## ఎన్నిసార్లు ప్రకటిస్తారో...

**ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని సింగపూర్ రాజధానిని చేసినట్లే నెల్లూరును కూడా స్మార్ట్ సిటీ చేస్తున్నారు. అయితే ఈ స్మార్ట్ అన్నది ఒకటికి మూడు సార్లు ప్రకటనలకు పరిమితమైందే తప్ప ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు.**

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో వంద నగరాలను స్మార్ట్ సిటీలుగా చేస్తామని ప్రకటించడం తెలిసిందే! కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సొంతూరు నెల్లూరు కాబట్టి, ఆయన సిఫార్సుతో నెల్లూరు స్మార్ట్ సిటీల జాబితాలోకి చేరడం ఖాయమనుకున్నారు. అయితే కేంద్రం ప్రకటించిన స్మార్ట్‌సిటీల జాబితాలో నెల్లూరు లేకపోయేసరికి నెల్లూరువాసులు నిరాశపడ్డారు. ఆ తర్వాత కేంద్రం బడ్జెట్‌లో కృష్ణపట్నంను ఇండస్ట్రియల్ పోర్టు సిటీగా ప్రకటించింది. అయితే దీని ఫలితం ఏంటన్నది ఇంత వరకూ తెలియలేదు. ఇండస్ట్రియల్ పోర్టు సిటీ అన్నారు తప్పితే ఇది ప్రకటించిన తర్వాత ఆ విధంగా అభివృద్ధికి నిధులివ్వడంగాని, పరిశ్రమలను ప్రకటించడంగాని, అభివృద్ధి ప్రణాళికలుగాని ఏవీ లేవు.

ఆ తర్వాత గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కొన్ని స్మార్ట్ సిటీలను ప్రకటించింది. ఈ సిటీలన్నీ కూడా పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలనుకున్నవే! తాజాగా రాష్ట్ర మంత్రివర్గం ఒంగోలు, ఏలూరు, అనంతపురం, శ్రీకాకుళం, కర్నూలులతో పాటు నెల్లూరును కూడా స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి చేయాలని ఆమోదించింది. అయితే స్మార్ట్ సిటీ విధి విధానాలేంటి, ఏ విధంగా అభివృద్ధి పనులుంటాయి, ఒక్కో సిటీకి ఎన్ని నిధులు మంజూరు చేస్తారన్నదానిపై స్పష్టత లేదు.

ముఖ్యంగా ఇప్పుడు నగరంలో వున్న రోడ్లు, మంచినీటి వసతి, డ్రెయిన్‌లు, పార్కులు, రిజర్వ్ స్థలాలు, మురికివాడలు వంటివాటిపై పూర్తి స్థాయి డేటా ఉండాలి. నెల్లూరు చూస్తే నిక్కృష్టానికి కేరాఫ్



అడ్రస్‌గా ఉంటుంది. నగరంలో పరిస్థితులు చాలా అధ్వాన్నంగా వున్నాయి. మురికివాడలు ఎక్కువ. అంతకుమించి ఆక్రమణలు ఎక్కువ. నగరంలో పంట కాలువలుగా పిలవబడే డ్రెయిన్‌లన్నీ ఆక్రమణలకు గురైవున్నాయి. ఈ ఆక్రమణలు తొలగించడం మున్సిపల్ మంత్రిగా నారాయణ వల్ల కావడం లేదు. ఇక ఈ ఆక్రమణలు తొలగిస్తే బాధితులకు ప్రత్యామ్నాయం ఎక్కడ చూపాలన్నదానిపై స్పష్టత లేదు. నగరంలో జిఎన్‌టి రోడ్డు బాగా ఇరుకైపోయింది. ముఖ్యంగా జాతీయ రహదారి నుండి యం.జి మాల్ దాకా ట్రంకురోడ్డు విస్తరణ జరిగింది. అక్కడ నుండి బోసుబొమ్మ దాకా రోడ్డు విస్తరణ పెండింగ్‌లో వుంది. గతంలో ఒకసారి విస్తరించాలని చూసినా తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో ఆ పని మానుకున్నారు.

నెల్లూరులో 1100కోట్లతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనులు జరుగుతున్నాయి. ఈ నిధుల భారం కార్పొరేషన్ మీద పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వడంతో నగర ప్రజల నెత్తిన భారం దించినట్లయ్యింది. ఇప్పుడు స్మార్ట్ సిటీ కూడా పిపిపి పద్ధతిలో అంటున్నారు. అంటే ఖర్చు చేసిన వ్యయభారం కొంత వరకు ప్రజలపై పడే అవకాశముంది. ఇప్పటికే నోట్ల రద్దు, పెరిగిన పన్నులు, తగ్గిన ఆదాయాలతో జనం సతమత మవుతున్నారు. మళ్ళీ స్మార్ట్ సిటీ పేరుతో పన్నులు బాదితే ప్రజలు భరించే స్థితిలో లేరు. కాబట్టి స్మార్ట్‌ను స్మార్ట్‌గా పూర్తి చేస్తేసరి... ప్రజలను బాదే పనైతే ఆ స్మార్ట్ అక్కర్లేదు.

# అన్ని వ్యాపారాలకూ షాక్ ...!

- నోట్ల రద్దు ప్రభావం నుండి బయటపడని జనం
- వ్యాపార సంస్థలకు కొనసాగుతున్న కష్టాలు

పెద్దనోట్ల రద్దు ఎఫెక్ట్... సినిమా హాళ్లలో కలెక్షన్‌లు పడిపోయాయి. సినిమా హాళ్లలో పాప్‌కార్న్ అమ్మకాలు తగ్గిపోయాయి. సినిమాహాల్ పార్కింగ్ షాపులు, బిర్యానీ సెంటర్లు కిటకిటలాడుతుండేవి. ఇప్పుడు సండే కూడా వీటి వద్ద ఆ సందడి కనిపించడం లేదు. కూరగాయలు, పండ్ల కొనుగోలు తగ్గిపోయింది.



వసూళ్లు తగ్గాయి. ఆసుపత్రుల్లో పేషంట్లు తగ్గారు... మందుల షాపుల్లో సరాసరి అమ్మకాలు 50శాతం పడిపోయాయి. ఎమర్జెన్సీ రోగాలకు తప్పితే జనాలు ఆసుపత్రులకు పోవడం లేదు. మాల్స్‌లో జనం తగ్గారు. కెఎఫ్‌సి, డొమినోస్ వంటి ఫుడ్‌కోర్టులకు పోయే వాళ్లు తగ్గిపోయారు. వాళ్ల టర్నోవర్ పడిపోయింది. ఆటో మొబైల్ షోరూంలలో కార్ల అమ్మకాలు తగ్గాయి. ద్విచక్రవాహనాల అమ్మకాలు పడిపోయాయి. ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఎల్‌సిడిలు కొనేవాళ్లు తగ్గిపోయారు. మల్టీక్యూసైన్ రెస్టారెంట్ల బిజినెస్ పడిపోయింది. కాకా హోటళ్లు, మాస్ టీ సెంటర్లు కొంచెం జరుగుతున్నాయి. బేకరీలు, స్వీట్స్ అమ్మకాలు తగ్గాయి. వోల్వో బస్సుల్లో ఎక్కేవాళ్లు తగ్గారు. నాన్‌ఏసి బస్సులకు అలవాటు పడుతున్నారు. ఏ.సి రైలు ప్రయాణాలు సైతం తగ్గిపోతున్నాయి. డీజిల్, పెట్రోల్ వాడకం కూడా తగ్గిపోయింది. ఇంతకు ముందు ఆదివారం వస్తే చికెన్, మటన్ దీంతో వాటి రేట్లు బాగా తగ్గుముఖం పట్టాయి. అన్నింటికంటే ప్రధానంగా ఎప్పుడు చూసినా రద్దీగా కనిపించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రిజిస్ట్రేషన్‌లు లేక వెలవెలబోతున్నాయి.

ఆ వ్యాపారం ఈ వ్యాపారం అని కాదు గాని, పెద్దనోట్ల రద్దు ప్రభావం ప్రతి వ్యాపారం మీద తీవ్రంగానే వుంది. అయితే లగ్జరీ వ్యాపారాల మీద తీవ్రత వంద శాతం వుంటే, సన్న, చిన్న వ్యాపారాల మీద ఓ50శాతం వుంది. ముఖ్యంగా పండుగల సీజన్‌లో బట్టలు, నగల దుకాణాలపై దీని ప్రభావం దారుణంగా వుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది పండుగ అమ్మకాలు 50శాతం జరిగినా గొప్పేనని వ్యాపారులు భావిస్తున్నారు.

ఇటీవల మెగా హీరో రాంచరణ్ నటించిన ధృవ సినిమా విడుదల కావడం తెలిసిందే! ఆ సినిమాకు హిట్ టాక్ వచ్చింది. అగ్రహీరోల సినిమా హిట్ టాక్ వస్తే కనీసం 10రోజుల పాటన్నా టిక్కెట్లకు డిమాండ్ ఉంటుంది. కాని 'ధృవ' సినిమా టిక్కెట్లుకు అంత డిమాండ్ లేకపోవడమే నోట్ల రద్దు తీవ్రతను తెలియజేస్తుంది.

నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యాపారాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. అన్ని వ్యాపారాలకు మూలమైన రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. రియాల్టీ బాగుంటే మిగతా వ్యాపారాలలోనూ జోష్ ఉంటుంది. రియాల్టీ పడిపోవడం, దాని మూలంగా ఇతర వ్యాపారాలు దెబ్బతినడంతో చాలా వ్యాపార సంస్థలు దివాళా తీసే స్థితిలో ఉన్నాయి.

## షార్ ఏ.డిగా మూర్తి



శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్ సెంటర్) అసోసియేట్ డైరెక్టర్‌గా అనంతపురం జిల్లా తాడిమర్రికి చెందిన ఎం. బద్రీనారాయణ మూర్తిని నియమించారు. మూర్తి విద్యా నగర్‌లోని ఎన్‌బికెఆర్ కళాశాలలోనే బి.టెక్ పూర్తి చేశారు. కోయంబత్తూరులో పిఎస్‌జీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో ఎంఇ పూర్తి చేశారు. 1987లో షార్‌లో ఎస్‌సి ఇంజనీర్‌గా చేరారు. 1998లో షార్ రెండో లాంచ్ ప్యాడ్ నిర్మాణంలో క్రయోజనిక్ ప్రొపెల్లెంట్ సిస్టమ్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా నియమించబడ్డారు. ఇప్పుడేమో లిక్విడ్ ప్రొపెల్లెంట్ స్టోరేజ్ అండ్ సర్వీస్ ఫెసిలిటీ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిస్తున్న శ్రద్ధ, అంకితభావాన్ని గుర్తించి ఇస్రో ఆయనను షార్ అసోసియేట్ డైరెక్టర్‌గా నియమించింది.

# ర్యాలీలకేమో సర్కారు విద్యార్థులు ర్యాంకులకు నారాయణ విద్యార్థులా?



ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రచారం కోసం ఆదివారం నెల్లూరులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బాధ్యతను జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్‌కు అప్పగించగా, ఆయన ఆ పనిని కార్పొరేషన్ మేనేజర్ రాజేంద్ర నెత్తిమీద పెట్టాడు. అయితే, ఆదివారం ర్యాలీ ప్రారంభ సమయానికి ఎన్‌సిసి విద్యార్థులు ఓ 50 మంది తప్పితే ఇతర విద్యార్థులు పెద్దగా రాలేదు. ఈ ర్యాలీలో పాల్గొని ఫోటోలకు ఫోజులిద్దామని వచ్చిన మంత్రికి అక్కడ విద్యార్థులు రాకపోవడం చూసి అరికాల్లో మండింది. దాని తర్వాత నారాయణ కాలేజీలో మంత్రి నిర్వహించిన సమావేశానికి జేసి ఇంతియాజ్ అహ్మద్ రాగా, ర్యాలీకి ఎందుకు విద్యార్థులను తీసుకురాలేకపోయారంటూ మంత్రి ఆయనపై చిర్రుబుర్రులాడారు.

నారాయణ విద్యాసంస్థల్లో వేలాదిమంది విద్యార్థులున్నారు. ఆ స్కూళ్ళకు బస్‌లు కూడా వున్నాయి. ఈ సారి ర్యాలీలకు, సభలకు విద్యార్థులను తీసుకురావాలంటే నారాయణ విద్యాసంస్థల విద్యార్థులనే తీసుకువచ్చేవిధంగా అధికారులు మంత్రితో ఒప్పందం చేసుకోవాలి. అప్పుడు అధికారులకు విద్యార్థులను వెదుక్కునే బాధ్యత తప్పుతుంది. నారాయణ విద్యార్థులేమో ర్యాంకులు తెచ్చుకోవాలి, సర్కారు స్కూళ్ళ విద్యార్థులు మాత్రం ర్యాలీలకు హాజరై చదువులు సంకనాకిపోవాలన్నట్లుగా వుంది మంత్రి వ్యవహారం.




# నెల్లూరు కబుర్లు

## పండుగలు వచ్చేస్తున్నాయ్ బాబోయ్...!

పెద్ద నోట్ల రద్దు పుణ్యమాని ఈసారి సరదాగా జరుపుకొనే పండుగలను కూడా సంతోషంగా జరుపుకొనే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో లాగా ఈ పండుగల హడావుడి కనిపించడం లేదు. 24వ తేది క్రిస్మస్ పండుగకు నగరంలోని అన్ని చర్చిలను ముస్తాబుచేసినా గతంలో లాగా హంగామా లేదు. క్రిస్మస్ వచ్చిందంటే షాపింగ్ మాల్‌లు కిటకిటలాడేవి. కాని ఈసారి ఆ పరిస్థితి లేకుండా పోయింది. ముఖ్యంగా న్యూ ఇయర్ వేడుకలకు అందరూ నాలుగైదు రోజుల ముందే ప్లాన్ చేసుకుంటారు. కానీ ఈసారి అంత ఉత్సాహంగా జనం లేరు. సంక్రాంతి పండుగ కూడా ఈసారి బోసిపోయేటట్లుగా ఉంది.

## పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా రాజు

నెల్లూరులోని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా డా॥ రాధాకృష్ణం రాజు ఈ నెల 21వ తేదిన బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్‌గా పనిచేసిన డా॥ భారతి బదిలీపై వెళ్ళడం తెలిసిందే. సూపరింటెండెంట్‌గా భాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణంరాజును సహచర వైద్యులు సిబ్బంది కలిసి అభినందించారు.

## శ్రీ రామకృష్ణ ట్రస్ట్ సేవలు అభినందనీయం



నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని నవలాకుల తోటలో వున్న శ్రీరామకృష్ణ సేవాశ్రమ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అమ్మ శ్రీ శారదామాత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా అనాథలకు, ఆపదల్లో వున్నవారికి ఈ ట్రస్ట్ ఎంతగానో సేవలు చేస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## సినీఫక్కీలో కొత్తనోట్ల పట్టివేత!

ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని మినర్వా గ్రాండ్ హోటల్ వద్ద పెద్దసీన్ చోటు చేసుకుంది. సాయంత్రం సమయంలో ఉన్నట్లుండి పోలీసు జీపులు హోటల్‌ను చుట్టుముట్టాయి. హైదరాబాద్ నుండి వచ్చిన కొందరు వ్యక్తులు భారీ ఎత్తున నగదు మారుస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆకస్మికదాడి జరిపారు. ఈ దాడిలో నలుగురు హైదరాబాద్ వ్యక్తులను అరెస్ట్ చేశారు. అయితే వీరంతా కూడా హైదరాబాద్‌లో ఓ భూమి లావాదేవీ కోసం నెల్లూరొచ్చారు. భూమి యజమానులు నెల్లూరులో ఉండడంతో వారి వద్ద జిపిఏ తీసుకుని నగదు ఇచ్చేందుకు రావడం జరిగింది. అయితే వారు ఇవ్వజూపిన కోటి 58లక్షల నగదు కొత్త 2వేల కట్టల రూపంలో ఉండడంతో ఇంత కొత్త కరెన్సీ ఎక్కడనుండి వచ్చిందన్న దానిపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు. అయితే దీనికి పెద్ద విచారణ కూడా అవసరం లేదు. మార్కెట్‌లో 30శాతం, 20శాతం కమిషన్ మీద అందరికీ ఎలా వచ్చిందో వీరికి కూడా అలాగే వచ్చి ఉంటుంది. అందులో సందేహమేముంది. ఒక దశలో పోలీసులు చుట్టుముట్టిన తీరు చూసి హోటల్‌లో ఉగ్రవాదులు దాక్కున్నారనే పుకార్లుకూడా వ్యాపించాయి. అలాగే వందలకోట్లలో నగదు మార్పిడి జరుగుతుందనే వదంతులు కూడా షికారు చేశాయి.

## 'లిటిల్ టీత్'కు జాతీయస్థాయి గుర్తింపు

**- డాక్టర్ టి. రవికుమార్**



నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లిటిల్ టీత్ చిన్న పిల్లల దంత వైద్యశాలకు 'ది బెస్ట్ చిల్డ్రన్ డెంటల్ హాస్పిటల్'గా జాతీయస్థాయి గుర్తింపు లభించిందని రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ టి.రవికుమార్ తెలిపారు. మంగళవారం హాస్పిటల్‌లోని తన ఛేంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముంబైలోని ఫాండెంట్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో లిటిల్ టీత్ విజయకేతనం ఎగురవేసిందన్నారు. దేశంలోని అన్ని రకాల దంతవైద్యశాలలను పరిశీలించి వైద్యశాల నాణ్యత, వారు అందించే వైద్యసేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ జాతీయస్థాయి గుర్తింపు పోటీల్లో దేశవ్యాప్తంగా 15 వందల దంతవైద్యశాలలు పోటీపడగా, లిటిల్ టీత్‌కు ఈ అరుదైన గుర్తింపు లభించిందన్నారు. దంత వైద్యములో 9 విభాగాల్లో పోటీలు జరిగాయని, అందులో లిటిల్ టీత్‌కు బెస్ట్ క్లినికల్ ఇంటీరియర్స్ ఇన్ ఇండియా అనే విభాగంలో ప్రథమస్థానం లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లినేని శ్రీకాంత్ మాట్లాడుతూ, తమ క్లినిక్‌లో వున్న అత్యాధునికమైన వైద్య సౌకర్యాలు, నాణ్యమైన వైద్యసేవలకు గాను ఈ విశిష్ట గుర్తింపు రావడం తమకెంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ జాతీయస్థాయి గుర్తింపు సింహపురికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.రవికుమార్ లిటిల్ టీత్ డాక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు.

## బాలయ్య అభిమానుల సందడి

ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని నర్తకి థియేటర్ వద్ద హీరో నందమూరి బాలకృష్ణ అభిమానులు పెద్దహంగామా చేశారు. బాలయ్య వందో చిత్రం 'గౌతమిపుత్ర శాతకర్ణి' ట్రైలర్‌ను ఆరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్తకి సెంటర్ వద్ద బాలయ్య ఫ్లెక్సీలను భారీఎత్తున ఏర్పాటు చేశారు. అప్పటికే నర్తకిలో మెగాహీరో రాంచరణ్ నటించిన 'ధృవ' ఆడుతుంది. ఆ సినిమాకు చెందిన ఫ్లెక్సీలను కనిపించనీయకుండా బాలయ్య ఫ్లెక్సీలను కట్టారు. భారీఎత్తున బాణా సంచా కాల్చారు. థియేటర్‌లో సినిమా ట్రైలర్‌ను చూసి బాలయ్య ఆవేశపూరిత డైలాగ్‌లకు ఆనందపరవశులై తెలుగుదేశం నాయకులు, బాలయ్య అభిమానులు హాల్ నుండి బయటకొచ్చారు. ఈ సినిమా ట్రైలర్‌ను చూసి తరించి ఆనందించిన వారిలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీమంత్రి టి.రమేష్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చాట్ల నరసింహారావు, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మన్ మంచికంటి సుధాకర్ తదితరులున్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామానికి చెందిన పెనుబల్లి హనుమంతరావునాయుడు తన సతీమణి పెనుబల్లి వేదవతి జ్ఞాపకార్థం నెల్లూరు క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆదివారం నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం ఈ విరాళాన్ని అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది అన్నదానం నిమిత్తం రూ. 10వేలు ఇచ్చేలా స్పందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ ఆశ్రమ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, వెలమ సంఘం జిల్లా అధ్యక్షులు సీతారామానాయుడు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపిఐఐసి జి.ఎం హఠాన్మరణం

ఏపిఐఐసి జిల్లా జనరల్ మేనేజర్ వై.ఎం.ప్రదీప్‌కుమార్ ఈ నెల 15వ తేదీ తెల్లారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 57సంవత్సరాలు. నెల్లూరులో ఏబిఎం కాంపౌండ్‌లో ఆయనుంటున్నారు. ఏలూరుకు చెందిన ప్రదీప్‌కుమార్ ఈ ఏడాది జూలైలో నెల్లూరుకు బదిలీపై వచ్చారు. అంతకుముందు కర్నూలులో పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు బిటెక్ చదువుతున్నారు. కుటుంబసభ్యులంతా హైదరాబాద్‌లో ఉంటుండగా ప్రదీప్ ఒక్కరే నెల్లూరులో ఉంటు న్నారు. తెల్లవారుజామున గుండెపోటు రావడం, ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు తోడు ఒక మనిషి కూడా లేకపోవడం ఆయన ప్రాణం మీదకు తెచ్చింది.

### ఇన్‌ఛార్జ్ జిఎంగా వేలాయుధం

పరిశ్రమలశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ జనరల్ మేనేజర్‌గా వేలాయుధంను నియమించారు. ప్రస్తుతం ఆయన పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రదీప్ మరణంతో వేలాయుధంకు ఈ అదనపు బాధ్యతలను అప్పగించడం జరిగింది.

## మాస్టర్ అథ్లెట్లకు అభినందన

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 10, 11వ తేదీల్లో జరిగిన 36వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన నెల్లూరు జిల్లాకు చెందిన మస్టార్ అథ్లెట్లకు ఆదివారం అభినందన సభ జరిగింది. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్ ఆవరణంలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు వివిధ వయో విభాగాల్లో 23 స్వర్ణం, 28రజతం, 16కాంస్య పతకాలను సాధించడం హర్షణీయమన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విశ్రాంత ఎస్పీ కృష్ణయ్య, కార్యదర్శి కోటేశ్వరమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరి శశిధర్, సహాయ కార్యదర్శి రాధ, కోశాధికారి వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి శ్రీ రంగనాధస్వామి అధ్యయనోత్సవాలు



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాధస్వామి ఆలయంలో డిసెంబర్ 29 నుండి జనవరి 17వ తేది వరకు ఎంతో వైభవంగా అధ్యయ నోత్సవాలు జరుగనున్నాయని, ఆ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఇ.ఓ. పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 8వ తేది వేకువన 4.30 గంటలకు వైకుంఠ ద్వారదర్శనం జరుగుతుందని, ఈ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారన్నారు. తమిళనాడులోని శ్రీరంగంలోని శ్రీ రంగనాయకస్వామి దేవస్థానం తరువాత అత్యంత పురాతన దేవాలయం నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయమేనన్నారు. స్వామివారికి అత్యంత వైభవంగా జరిగే ఈ అధ్యయనోత్సవాలకు భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆ రంగనాథుని కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు 'రత్నాలు'



ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరు డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థులు శ్రీదామిత, హేమంత్‌కుమార్ ప్రథమస్థానంలో గెలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఉపాధ్యాయులు వారిని అభినందించి మాట్లాడుతూ త్వరలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరుగనున్న పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు తెలిపారు.

# గురుభక్తికి ప్రతీక నాగభైరవ అవార్డు వేడుక

*గురుశిష్యుల అనుబంధానికి గురువుపట్ల శిష్యుడికున్న అభిమానానికి గుర్తుగా నెల్లూరులో జరిగే ఓ పండుగ డా.నాగభైరవ అవార్డు ప్రదానోత్సవం. ఒక గొప్ప వ్యక్తిని బిడ్డలే మరిచిపోతున్న ఈ రోజులలో తన గురువు జ్ఞాపకాలను పదిమందికి పంచుతూ తన గురువు గొప్పతనాన్ని లోకానికి చాటుతూ ప్రతి ఏటా నెల్లూరులో ప్రముఖ కవి చిన్నినారాయణరావు తన గురువు డా. నాగభైరవ కోటేశ్వరరావు అవార్డుపేరుతో జరుపుతున్న వేడుక ఈ ఏడాదికూడా ఘనంగా జరిగింది. ఈ నెల 18వ తేదిన జరిగిన ఈ వేడుకకు నెల్లూరులోని టౌన్‌హాల్ వేదికగా నిలిచింది.*




రావి రంగారావుకు నాగభైరవ అవార్డును ప్రదానంచేస్తున్న ముఖ్యఅతిథులు

ప్రముఖ కవి, దివంగత డా. నాగభైరవ స్మారక సాహితీ అవార్డు ప్రదానోత్సవం కన్నులపండువగా జరిగింది. సాహిత్యాభిమానులకు ఈ వేడుక ఒక పండుగగా జరిగింది. వేడుకలకే వేడుక అన్నట్లుగా జరిగిన ఈ సాహితీసందడి కవితారంగంలో నెల్లూరు సీమకున్న విఖ్యాతిని మరింతగా ద్విగుణీకృతం చేసింది. నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 18వ తేది జరిగిన ఈ సాహితీ సందడిలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రేక్షకజనసందోహంతో..పురమందిరం క్రిక్కిరిసిపోయింది. ఎందరో సాహిత్యాభిమానులు .. నాగభైరవ అభిమానులు, పురప్రజలు, ప్రముఖుల మధ్య.. పెద్దఎత్తున విచ్చేసిన అభిమాన జనం మధ్య.. ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య..విఖ్యాత కవి రావి రంగారావుకు ప్రముఖ సాహితీవేత్త.. తెలుగు భాషాభిమాని ..డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ఎంతో ప్రతిష్ఠాత్మకమైన డా. నాగభైరవ అవార్డు బహుకరణ జరిగింది. డా. నాగభైరవ అవార్డు కమిటీ నేతృత్వం లో, ప్రముఖ సినీకవి వెన్నెల కంటి రాజేశ్వరప్రసాద్ సారధ్యంలో, అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు ఆధ్వర్యంలో ఈ అవార్డు సభ సకల జనరంజకంగా సాగింది. ఆధునిక కవిత్వానికి అగ్రతాంబూలం ఇస్తున్న ఈ సాహితీసంరంభంలో మినీకవితా పితా మహుడుగా ప్రఖ్యాతిగాంచిన డా. రావి రంగా రావును గజమాలతో, జ్ఞాపికతో, 10 వేల రూపా యల నగదు బహుమతితో ఘనంగా సత్కరించి అవార్డు కమిటీ కవుల ఘనసత్కారానికి నిండైన వేదికగా నిలిచింది. సభలో డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ప్రసంగం ఎంతో ఆలోచనాత్మకంగా వుండి సాహితీ వేత్తలకు మార్గదర్శనం చేస్తే, ప్రముఖ సినీనటులు శ్రీకృష్ణ భగవాన్ ప్రసంగంతో పాటు.. ఆయన చెప్పిన సినీ డైలాగ్‌లు ప్రేక్షకులను అలరించాయి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, కావలి మార్కెటింగ్‌కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జి.వి పూర్ణచంద్, నాగభైరవ కుమారుడు వీరబాబు, మనుమడు కూకట్ల రాఘవేంద్ర, ప్రముఖ రచయిత పొట్లూరు హరికృష్ణ (హైదరాబాద్), ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు తది తరులు పాలొన్న ఈ సభకు వెన్నెలకంటి అధ్యక్షత వహించి ఆద్యంతం జనరంజకంగా సభానిర్వహణ గావించి అందరి ప్రశంసలను అందుకున్నారు. అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్ని నారాయణ రావు తమ గురువుగారైన డా. నాగభైరవ కోటేశ్వర రావు గురించి, కవులందరికీ స్ఫూర్తిదాయకమైన ఆయన రచనల గురించి, తాము స్థాపించిన డా. నాగభైరవ అవార్డు విశిష్టత గురించి తన ప్రారంభో పన్యాసంలో చక్కగా వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ఏడే ప్రవేశపెట్టిన నాగభైరవ అధ్యాపక అవార్డును ప్రముఖ కవి, విశ్రాంత అధ్యాపకులు పచ్చిపులుసు వెంకటేశ్వర్లుకు ప్రదానం చేశారు. అదేవిధంగా, మరో అయిదుగురికి డా. నాగభైరవ స్ఫూర్తి అవార్డ లను బహుకరించారు. ఈ స్ఫూర్తి అవార్డులను అందుకున్నవారిలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, లాయర్ వారపత్రిక ఉపసంపాదకుడు మద్దూరు శ్రీనివాసులు, ప్రముఖ పాత్రికేయుడు ఈతకోట సుబ్బా రావులతో పాటు, ప్రముఖ కవులు కాసుల నాగభూష ణం (చెన్నై), కె. విల్సన్‌రావు (హైదరాబాద్), శ్రీమతి జ్యోతిష్మతి (అద్దంకి) వున్నారు. వీరికి నగదు బహు మతితో పాటు ఘన సత్కారం చేశారు. తొలుత కళాం జలి అనంత్ ఆధ్వర్యంలో జరిగిన సంగీత విభావరి ఆకట్టుకుంది. అలాగే ఈ వేడుకకు అతిథులుగా వచ్చినవారు అవార్డు కమిటీ పక్షాన వెన్నెలకంటి , చిన్ని నారాయణరావులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరిం చారు. నాగభైరవకోటేశ్వరరావు అభిమానులు, సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ఎం.ఎల్.సి. బీద రవిచంద్ర, వెన్నెలకంటి, కృష్ణభగవాన్ చేతులమీదుగా నాగభైరవ స్ఫూర్తి అవార్డును అందుకుంటున్న మద్దూరు శ్రీనివాసులు, ఈతకోట సుబ్బారావు, కాసుల నాగభూషణం, కె.విల్సన్ రావు, జ్యోతిష్మతి, పచ్చిపులుసు వెంకటేశ్వర్లు

# రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న జగన్

వైఎస్సార్సీపి అధినేత జగన్ అడుగ డుగునా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నా డంటూ టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద విచంద్ర ధ్వజమెత్తారు. నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఈ నెల 18న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్సీపి తీరును, జగన్ వైఖరిని దుయ్యబట్టారు. జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులకు అవసరమైన మంచినీటిని కూడా గత 40 ఏళ్ళ చరిత్రలో వైఎస్ కుటుంబం ఏనాడూ అందించలేదని, ముఖ్యమంత్రిగా చంద్ర బాబు అధికారంలోకి వచ్చిన తరువాతనే నదుల అనుసంధానం ద్వారా పట్టిసీమ నుంచి నీటిని ఆ నియోజకవర్గానికి అందిం చారని బీద రవిచంద్ర అన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు రాకుండా జగన్ అడ్డుకునే ప్రయ త్నం చేశాడని, అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ వ్యవహరిస్తున్నాడని ఆయన విమర్శించారు. అంతేకాక, రాష్ట్రా నికి పరిశ్రమలు రాకుండా ప్రయత్నించిన ఘనత కూడా జగన్‌దేనని ఆయన



అన్నారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపో తోందంటూ జగన్ విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. లక్ష కోట్ల ప్రజా ధనాన్ని దోచుకున్న జగన్ నుంచి 43 వేల కోట్ల అక్రమార్జనను ఇ.డి నిగ్గుతేల్చిందని, దేశంలో ఏ రాజకీయపార్టీ నేత నుంచి ఇలా రికవరీ చేసిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. అసలు, రాష్ట్రం విడిపో వడానికి వైఎస్ కుటుంబమే కారణ మని, కోట్లాదిరూపాయల కాంట్రాక్టులకోసం కెసిఆర్‌తో కుమ్మక్కయింది జగనేనని ఆయన ఆరోపించారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరని, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందని ఆయన అన్నారు. కాగా, ఇటీవల జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కూడా లక్ష్యాన్ని అధిగమించిందని, సభ్యత్వ లక్ష్యం 3.60 లక్షలు కాగా, ఆ సంఖ్య 4.36 లక్షలకు చేరువైందని, తెలుగుదేశంపార్టీ పట్ల జనాదరణకు ఇది నిదర్శనమని అన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ చేపట్టిన జనచైతన్యయాత్రల్లో అనేక ప్రజా సమస్యలు పార్టీ దృష్టికి వచ్చాయని ఆ సమస్యలన్నిటినీ ప్రభుత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి తగు కృషి చేస్తామని ఆయన అన్నారు. జనవరిలో జన్మభూమి కార్యక్రమాలు కూడా ప్రారంభ మవుతాయని, అందుకు పార్టీ నాయకులు సంసిద్ధంగా వుండాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, వేనాటి రామ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెప్పింది చేస్తా..చేసి చూపిస్తా



'నేను మాటల మంత్రిని కాదు. చెప్పింది చేస్తా..చేసి చూపిస్తా. ప్రజలకిచ్చిన హామీ లను నెరవేర్చి తీరుతా. వాగ్దానాలను గాలికి వదిలివేయడం నాకు చేతకాదు. ప్రజలకు ఏదైనా హామీ ఇచ్చానంటే అది నెరవేరినట్టే. ఆ హామీ అమలుకు నిరంతరం కృషి చేస్తా. ఆ సమస్య పరిష్కారమయ్యేదాకా వదిలే ప్రసక్తే లేదు'..అని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ నెల 17న నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఎప్పటికప్పుడు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరుచేయిస్తూ జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. నెల్లూరు నగరంలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తున్నానని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించేందుకు తగు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పెద్దనోట్ల రద్దుతో సామాన్య ప్రజలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా బ్యాంకర్లతో సమావేశమై ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు ఈ అంశంపై బ్యాంకర్లతో సంప్రదించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని బ్యాంకర్లకు సూచిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, మేయర్ అబ్దుల్ అజీజ్, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## పోలీసులు ప్రజలతో సఖ్యతగా వుండాలి

– డిఎస్పీ బాదేపల్లి శ్రీనివాస్



పోలీసులు ప్రజలతో సఖ్యతతో వుండాలని, వారితో కలసిమెలసి సత్సంబంధాలు కలిగివుండాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని డిఎస్పీ బాదేపల్లి శ్రీనివాస్ అన్నారు. గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఇటీవల సందర్శించారు. ఏటా సాధారణ తనిఖీల్లో భాగంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ పెండింగ్ ఫైల్స్ ఏమైనా వుంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంట రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ, పోలీసులు వున్నారు.

### వైజేపీ లయన్స్ ఆధ్వర్యంలో

## బెంచీలు..దుప్పట్లు పంపిణీ




వైజేపి లయన్స్ క్లబ్ ద్వారా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వై.జే ప్రభాకరరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని క్లబ్ రీజనల్ ఛైర్మెన్ గౌతం, క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కలవకొండలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తున్నామని, పారిచెర్లవారిపాళెంలోని ఉన్నత పాఠశాలలో బెంచీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గిరిజనకాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఉన్నతపాఠశాలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. పారిచెర్లవారిపాళెం అభివృద్ధికి దాత నెలబల్లి రామచంద్రారెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారని, ఆ వచ్చే వడ్డీపై ఏటా పదవ తరగతిలో మొదటిస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం, గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని జిఎంయుపి పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శి నాగహరికృష్ణ, ప్రతినిధులు మురళీనాయుడు, ఆర్వీరావు, ఎస్ఎల్ఎన్ బాబు, ఎన్.ఎల్.ఎన్ స్వామి, బాబురావు, వేణురెడ్డి, సుబ్రహ్మణ్యం, పిఆర్ఓ పెల్లేటి వెంకటరామిరెడ్డి, మంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 21వ తేదీన శ్యామల హార్డ్‌వేర్స్ ఆధ్వర్యంలో గూడూరులోని వనజకృష్ణ కళ్యాణ మండపంలో జరిగిన బ్రెడ్జర్ పెయింటర్స్ అవగాహన సదస్సులో పాల్గొని పెయింటింగ్‌పై అవగాహన కల్పించిన మేనేజర్ దామోదర్‌ను సత్కరిస్తున్న అనిల్ మరియు నిర్వాహకులు

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

– ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్




గూడూరు ప్రాంతంలోని విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 17న జరిగిన సీనియర్ సిటిజన్, పెన్షనర్ల దినోత్సవాన్ని ఆ సంఘం అధ్యక్షుడు బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిఆర్ రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడుతూ, ఉద్యోగులు విధి నిర్వహణలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉంటారని, ప్రస్తుతం రిటైరైన తరువాత ప్రశాంతమైన జీవితాన్ని ఏర్పరచుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నేవీ ఆఫీసర్ దశరథరామిరెడ్డితో పాటు మరో 25 మంది విశ్రాంత ఉద్యోగులను ఎమ్మెల్యే, ఇతర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, పలు బ్యాంక్‌ల మేనేజర్లు, విశ్రాంత ఉద్యోగులు తిరుపాలయ్య, సుందరరామయ్య, కృష్ణయ్య, నర్సింహరావు, జయకుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు సమదుస్తులు






గూడూరు పట్టణంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి మనుమడు పుట్టినరోజు సందర్భంగా ని సరస్వతి శిశుమందిర్‌లోని 200 మంది విద్యార్థులకు వారు సమదుస్తులు (యూనిఫామ్) పంపిణీ చేశారు. ఈ నెల 17న స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రమహిళామండలి గౌరవాధ్యక్షురాలైన డాక్టర్ సి. రోహిణి మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌లు చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా వుండడం అభినందనీయమన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదపిల్లలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశుమందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ సిఆర్ రెడ్డి, ఆయా క్లబ్‌ల ప్రతినిధులు ఆర్‌వి రావు, ఎల్లసిరి లక్ష్మి, విష్ణువందన, సులక్ష్మి, పరమేశ్వరి, జమున, సౌందర్యమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నివాళి



శ్రీమతి జమిలి రాజ్యలక్ష్మి గారి

ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ....

# రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 23.12.2016 నుండి
తేది. 29.12.2016 వరకు

ఈ వారము సింహంలో రాహువు, కన్యలో గురువు, తులవృశ్చిక ధనుః రాశులలో చంద్రుడు, వృశ్చికలలో శని, ధనుస్సులో రవి బుధులు, మకరంలో శుక్రుడు, 28 తేది నుండి కుంభంలో శుక్రుడు, కుంభంలో కేతు కుజులు సంచరిస్తాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

షేర్లు, పెట్టుబడులు నిరుత్సాహం కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ పెట్టండి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం, ఆర్థికావకాశాలు తగ్గిపోవడం వుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. ముఖ్యమైన శుభవార్త వింటారు. శుభకార్య యత్నాలలో అనుకూలత బావుంటుంది. దైవసేవా కార్యాల్లో పాల్గొనడం, దూరప్రయాణాలుండడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో జాగ్రత్త వహించండి. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బంధుమిత్రుల రాకపోకలు, మీకు సహాయపడడం జరుగుతుంది. శుభవార్తలు వింటారు. దైవ కార్యాలలో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆలస్యం కాగలవు. విద్యాప్రగతి బాగుంటుంది. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులు, ప్రయాణ ఖర్చులు బాగుంటాయి. చేసే కృషికి తగ్గట్టుగా ఆర్థిక స్థితి వుండదు. ఖర్చులు బాగా పెరిగిపోతాయి. పనుల మీద శ్రద్ధ తగ్గి శారీరకంగా మానసికంగా ఇబ్బందిపడతారు. వాహనాలు నడిపేవారు, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తపడాలి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. కాబట్టి అధికారులు గమనించుకొనండి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్త. శరీరానికి గాయాలు తగులవచ్చును. కోర్టు వ్యవహారాలలో అనుకూలత. రావలసిన బాకీలు కొంతమేరకు లభించడం జరుగుతుంది. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. ఉద్యోగులకు అధికారులకు సత్సంబంధాలు వుంటాయి. కుటుంబ సౌఖ్యం, విద్యార్థులకు విద్యావృద్ధి వుంటుంది. వ్యవహారాలలో నిర్ణయాలను, ఆర్థికవ్యవహారాలను సమర్థవంతంగా జరుపుతారు. మాట, ప్రవర్తనలో తొందరపాటు లేకుండా చూచుకొనండి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా వుండి ఆదాయం బాగుంటుంది. భార్యాబిడ్డలకు అనారోగ్య బాధలుండగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిడ్డలకు అనారోగ్య బాధలుంటాయి. దైవకార్యాలలో పాల్గొనడం, ప్రముఖ పరిచయాలుంటాయి. శుభవార్తలు వింటారు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల వల్ల సహచరుల వల్ల సమస్యలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి కొద్దిగా పెరుగుతుంది. ఉపాధి పథకాలలో నిలదొక్కుకుంటారు. కళా క్రీడా శాస్త్ర వైద్య రంగాలవారికి పరిస్థితులు ప్రోత్సాహకరంగా వుంటాయి. అనుకున్న పనులు ఆలస్యంగా జరుగుతాయి. మిత్రుల సహకారంతో కొనసాగిస్తారు. అవసరాలకు రుణం చేయడం, ఇతరులు బంధువులతో సత్సంబంధాలు గట్టిపరచుకొనడం వుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులకు ప్రయోజనం కలిగే పనులు జరగడం, అధికార వర్గ అనుకూలత వుంటుంది. ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. శుభకార్య ప్రయత్నాలు, అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. కుటుంబంలో చిన్నచిన్న విషయాల వల్ల అభిప్రాయభేదాలుంటాయి. కాబట్టి సర్దుకుని పోవాలి. బిడ్డల వల్ల ఖర్చులు, కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పెరుగుదల వుండి, ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభ కార్యాలు నిర్ణయం కాగలవు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. రావలసిన బాకీలు లభించడం, స్థిరాస్తుల లావాదేవీలు జరుగగలవు. హామీలు ఇవ్వడం, రిస్క్ తీసుకోవడం చేయవద్దు. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి వుంటుంది. కానీ మనసుకు కొరతగా అనిపిస్తుంది. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలుంటాయి. పనుల విషయంలో టెన్షన్ ఎక్కువగా వుంటుంది. ఉద్యోగులకు అదనపు పనిభారం, అధికారుల సహకారం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొత్త పథకాలు ప్రణాళికలు అమలుచేస్తారు. ఆకర్షణలకు, వత్తిడులకు లొంగవద్దు. దూరప్రయాణాలుంటాయి. దైవ సేవా కార్యాల్లో పాల్గొనడం, పెట్టుబడులపై లాభాలుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువుల నుండి శుభవార్త వింటారు. ఆరోగ్యం కాపాడుకోండి. ఆర్థికంగా పెరుగుదలకు చేసే పనులన్నీ కలసివస్తాయి. ఆదాయం పెరుగుతుంది. సోదరవర్గానికి అభివృద్ధి వుంటుంది. పన్నులు, బాకీలు చెల్లిస్తారు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు ప్రభుత్వ సహకారం వుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

జీవిత సహచరులకు ఆరోగ్యలోపం వుండవచ్చును. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల వల్ల ఇబ్బందులు కలుగవచ్చును. గృహ వస్తు రిపేర్లు వుండవచ్చును. శ్రమతో అనుకున్న పనులు జరుపుకుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కొన్ని ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలో గాని, కుటుంబ నిర్ణయాలలో గానీ పొరపాట్లు రాకుండా జాగ్రత్తపడండి. వృత్తి జీవనము కలవారికి కొంత ఆదాయం వుంటుంది. పెద్ద పెట్టుబడులు పెట్టడం, హామీలివ్వడం చేయవద్దు. కోర్టుకేసులు చికాకు కలిగించగలవు. బంధుముఖ్యులతో మాట పట్టింపు విరోధాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభ కార్యాలు నిర్ణయం కావచ్చును. దైవసేవలు, సభలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం సరిగా వుండదు. కొత్త కాంట్రాక్టులు అగ్రిమెంట్లు లీజులకు అవకాశాలు రాగలవు. కుటుంబ సమస్యలను రాజీమార్గంలో సర్దుబాటు చేయగలవు. వాణిజ్యవృద్ధికి మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు నెరవేర్చుకుంటారు. ఉద్యోగులకు పని బాధ్యతలపై శ్రద్ధ వుండడం, రావలసిన బాకీలు చేతికందడం, స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగుట, దూర ప్రయాణాలు తప్పనిసరిగా వుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

గృహోపకరణాలు, విలువైన వస్తువులు చేకూరుతాయి. దైవకార్యాలలో పాల్గొనడం, సహాయపడడం జరుగుతుంది. దూర ప్రయాణాలుంటాయి. శుభవార్తలు వింటారు. స్వల్ప అనారోగ్య సమస్యలుండవచ్చును. ఉద్యోగార్థులకు ప్రయత్నాలు ఫలించవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆర్థికంగా కొద్దిపాటి చిక్కులు వున్నా సమర్థించుకుని పోగలరు. భూములు, ఆస్తులు, ఇండ్ల లావాదేవీలు వాయిదా వేయండి. పనులు సమర్థతతో అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. మిమ్మల్ని విమర్శించేవారు కూడా మీకు చేరువ కాగలరు. కళా క్రీడా మార్కెటింగ్ రంగాలవారికి ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్తవారితో పరిచయాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తులు క్రయ విక్రయాల ప్రయత్నాలు జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఉద్యోగ బాధ్యతలు పెరిగి విశ్రాంతి తగ్గుతుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభిస్తాయి. విద్యాప్రగతి బాగుంటుంది. కుటుంబంలో స్వల్పంగా అపార్థాల వల్ల సమస్యలుండి సర్దుకుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. అయినా ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులకు ఆటంకాల వల్ల టెన్షన్‌గా వుంటుంది. ఆర్థిక వ్యవహారాలను సొంతంగా ఆజమాయిషీ చేస్తారు. పెట్టుబడులకు అవకాశాలు, షేర్ల మీద లాభాలు వుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులలో జాప్యం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభవార్తలు వింటారు. బంధు ముఖ్యలను, ఆత్మీయులను కలుసుకుంటారు. నిరుద్యోగులకు అవకాశాలు, ఉద్యోగులకు బాధ్యత భారం పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగిపోతాయి. కొత్త వ్యాపారాలకు అవకాశాలు పెట్టుబడి అవకాశాలు వాయిదా పడగలవు. బంధు వర్గ సభ్యుల అనారోగ్య వార్తలు అందగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడడం, కుటుంబఖర్చులు, కొన్ని అదనపు ఖర్చులనుండి తప్పించుకొనలేరు. దైవసేవ, దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పనులు చేపట్టినవి నిదానంగా జరుగుతాయి.

## పంచాంగము:

తేది 25 ఆదివారము క్రిస్‌మస్

### ముహూర్తములు

తేది 23 శుక్రవారము ఉదయం గం॥ 8.20 నుండి గం.10.24 ని॥ల లోగా మకరలగ్నమున వ్యాపార వివాహ అన్నప్రాశన ఉపనయనాలు.

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | దశమి | రా॥ గం.3.47 వ॥ |
| తేది. 24 | శని | ఏకాదశి | రా॥ గం.3.52 వ॥ |
| తేది. 25 | ఆది | ద్వాదశి | రా॥ గం.6.00 వ॥ |
| తేది. 26 | సోమ | త్రయోదశి | పూర్తిగ |
| తేది. 27 | మంగళ | త్రయోదశి | రా॥ గం.8.15 వ॥ |
| తేది. 28 | బుధ | చతుర్ధశి | రా॥ గం.10.17 వ॥ |
| తేది. 29 | గురు | అమావాస్య | రా॥ గం.12.00 వ॥ |

# అమరావతి నిర్మాణానికి నెల్లూరు మేస్త్రీలు

గల్పిక

వెలగపూడిలోని హైటెక్ రత్న, సీఎం చంద్రబాబు కార్యాలయం. చంద్ర బాబు, సహచర మంత్రులు సిఎం ఛాం బర్‌లో వున్నారు. చంద్రబాబును కలవాలని చెప్పి స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(66+) అప్పుడే అక్కడకు వచ్చాడు. చంద్రబాబు విచారంగా ఉండడాన్ని వివేకా గుర్తించి, ఏం అలా వున్నారని అడిగాడు. అందుకు మంత్రి నారాయణ... అమరావతి రాజధాని గురించి సార్ ఆందోళన పడుతున్నాడు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటాయి. శంకుస్థాపన శిలాఫలకాలకు బూజుపట్టింది... అని చెబుతుండగా వివేకా కలుగజేసుకుని... బూజుదేముంది దులిపితే పోతుంది కదా, దానికి బాధ పడడమెందుకన్నాడు. దానికి నారాయణ... సార్ బాధ బూజు కోసం కాదు, రాజధాని నిర్మాణానికి ఇంకా ఒక్క ఇటుక రాయి కూడా పేర్చనందుకు... ఇంత వరకు ఏ ఒక్క డిజైన్ ఫైనల్ కాలేదు. ఇక రాజధానిని ఎప్పుడు పూర్తి చేయాలన్నదే ఆయన ఆందోళన అని అన్నాడు. అసలు సబ్జెక్ట్ ఏంటో నాకు పూర్తిగా చెప్పండని వివేకా అడిగాడు. ఇది చెబితే అర్థమయ్యేది కాదు, చూస్తేనే అర్థం చేసుకోగలవు అంటూ చంద్రబాబు వివేకా కళ్ల ముందు వేళ్లతో స్క్రీన్ గీసి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లి సీన్‌లు ప్లే చేశాడు.

★ ★ ★

2014 డిసెంబర్ నెల... హైదరాబాద్‌లోని హైటెక్‌రత్న, ఆంధ్రా సిఎం చంద్రబాబునాయుడు కార్యాలయం... చంద్రబాబుతో పాటు మంత్రులు పి. నారాయణ, కె.ఇ.కృష్ణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావులు వున్నారు. అప్పుడే అక్కడకు అమెరికాకు చెందిన ఇంజనీర్లు జాన్‌కెనడీ, రూదర్‌ఫోడ్, డాన్‌ఫ్రంట్, సండేసన్ వచ్చారు. చంద్రబాబు వారితో... మా అమరావతి రాజధానిని మీ న్యూయార్క్ సిటీలా కట్టాలనుకుంటున్నాం, దానికి సంబంధించిన భూసేకరణ పూర్తి చేసాం. మీరు రాజధాని స్కెచ్ గీసి ఇవ్వండి అని చెప్పాడు. ఓకే షెంద్రబాబు... ఓన్లీ టూ డేస్‌లో మీకు ప్లాన్ అరేంజ్ చేస్తాం అంటూ సండేసన్ హామీ ఇచ్చి లేచాడు.

రెండ్రోజుల తర్వాత చంద్రబాబు ఆఫీసుకు ఎయిర్ కొరియర్‌లో ఓ కవర్ వచ్చింది. చంద్రబాబు దానిని చించాడు. లోపల రాజధాని స్కెచ్ పేపర్లున్నాయి. తీసి చూసాడు. న్యూయార్క్ సిటీని ఆకాశం నుండి ఒక ఫోటో, నాలుగు దిక్కుల నుండి నాలుగు ఫోటోలు తీసి పంపినట్లుగా వున్నాయి ఆ స్కెచ్‌లు. అవి చూసి చంద్రబాబు... ఈ మాత్రం ఫోటోలు మనం తెచ్చుకోలేమా...వీళ్లతో కాదు గాని జపాన్ ఇంజనీర్లను పిలిపించండి మాట్లాడుదామని నారాయణను ఆదేశించాడు.

★ ★ ★

2015జూన్ నెల... చంద్రబాబు ఛాంబర్‌లో యధాఫలంగా మంత్రులు, జపాన్ నుండి వచ్చిన ఇంజనీర్లు పింగ్‌పాంగ్, యంగ్‌టాంగ్, జువాన్‌జింకో, కుత్సుబిషి నిపాన్‌లు అక్కడ వున్నారు. చంద్రబాబు వారితో... అమరావతి రాజధానిని అచ్చం మీ టోక్యో సిటీలా కట్టాలనుకుంటున్నాం. అందుకు అవసరమైన భూమిని కూడా తీసిపెట్టాం. మీరు మాకు టోక్యో సిటీని తలపించేలా డిజైన్ ఇస్తే చాలు... దీనికి ఎన్ని కోట్లయినా ఇస్తామన్నాడు. అందుకు వాళ్లు నాలుగు రోజుల్లో డిజైన్ పంపిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

నాలుగు రోజుల తర్వాత... జపాన్ ఇంజనీర్లు పంపించిన రాజధాని డిజైన్‌లను చంద్రబాబు చూస్తున్నాడు. ఆ డిజైన్‌లలో కృష్ణపట్నం జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలులాగా అన్నీ కూలింగ్ టవర్లే కనిపిస్తున్నాయి. ఆ డిజైన్ చూస్తుంటే చంద్రబాబుకు ఏమీ అర్థం కాలేదు. అంతలో అక్కడకు మీడియా ప్రతినిధులు వచ్చారు. అందరూ ఆ డిజైన్‌లను ఫోటోలు తీసుకున్నారు పక్కరోజు తెలుగు జ్యోతి, ఈరోజు పత్రికల్లో 'అమరావతి రాజధానికి అద్భుత డిజైన్' అని ఫోటోలు పెట్టి వార్తలు వ్రాస్తే, 'ఆత్మసాక్షి' పత్రికలో మాత్రం 'అమరావతిలో అణువిద్యుత్ కేంద్రం' అంటూ ఆ డిజైన్ ఫోటో పెట్టి ఫ్రంట్ పేజీలో ప్రచురించింది. ఆ వార్త చూసి చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. అంతలో జపాన్ ఇంజనీర్ పింగ్‌పాంగ్ చంద్రబాబుకు ఫోన్ చేసాడు. చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. పింగ్‌పాంగ్ వుండి... సార్, పొరపాటు జరిగింది. మా దేశంలో నిర్మించ తలపెట్టిన అణురియాక్టర్ల డిజైన్ మీకు పంపించారు. దానిని వెనక్కిపంపిస్తే మీకు టోక్యో డిజైన్ పంపిస్తామన్నాడు. చంద్రబాబు కోపంతో... మీ డిజైన్ అవసరం లేదు. మేం సింగపూర్ వాళ్ల చేత గీయించుకుంటాం, మాకు వాళ్లే కరెక్ట్ అంటూ ఫోన్ పెట్టేసాడు.

★ ★ ★

2016ఫిబ్రవరి... సింగపూర్ ఇంజనీర్లు పెంగ్‌లీ, మిచిలాస్, షిబురాలతో చంద్రబాబు మీటయ్యాడు. యధాఫలంగా అమరావతి రాజధాని గురించి చర్చ... అమరావతిని సింగపూర్‌లా చేయాలి... ఆ నిర్మాణ బాధ్యత కూడా మీరే తీసుకోండి, దానికి ఖర్చంతా మేమే పెట్టుకుంటాం, బిల్డింగ్‌లు కట్టాక ఆదాయం మాత్రం మీరు తీసుకోండి అని చంద్రబాబు ప్రతిపాదించాడు. దానికి వాళ్లు ఆనందంగా ఒప్పుకున్నారు. త్వరలో డిజైన్‌తో మీ ముందు వాలుతామంటూ వాళ్లు లేచి వెళ్లిపోయారు.

చంద్రబాబు ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ ముగించాడు. ఆ తర్వాత ఏమైంది అని వివేకా ప్రశ్నించాడు. అప్పుడు చంద్రబాబు... ఏమైంది, నా బొంద్దైంది... సింగపూర్ కంపెనీకి అన్ని లైన్‌లు క్లియర్ చేసారు, వారి కోసం నిబంధనలే మార్చాను, వాళ్లు డిజైన్‌లు కూడా గీసేసారు. ఇక సింగపూర్ అమరావతి రాజధాని మొదలు పెడదామనుకున్న తరుణంలో ఇదిగో ఈ మోడీ పెద్దనోట్లు రద్దు చేసి నా కొంప ముంచాడు. ఇప్పటి దాకా ప్రభుత్వానికొచ్చిన ఆదాయాన్నంతా పుష్కరాలు, పట్టిసీమ, మజ్జిగ ప్యాకెట్లకు పెట్టేసాను. కరెక్ట్‌గా రాజధానికి వచ్చే డబ్బు తగలబెడదామనే టైంకు పెద్దనోట్ల రద్దుతో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. అప్పటికీ తక్కువ బడ్జెట్‌తో రాజధానిని కంప్లీట్ చేద్దామని బాహుబలి సినిమా సెట్టింగ్‌లు నచ్చి దర్శకుడు రాజమౌళిని కూడా పిలిపించాను. అమరావతిలో టకటక సెట్టింగ్‌లు వేయించి రాజధానిని పూర్తి చేసామని చెప్పి కలరింగ్ ఇద్దామనుకున్నాను. కాని ఆ రాజమౌళికి ఇక సంవత్సరం తీరిక లేదట అని ఆవేదన చెందాడు. అదంతా విన్న వివేకా... ఓస్, దీనికే ఇంత ఇదైపోతున్నారా... అయినా పిల్లిని చంకలో పెట్టుకుని ఊరంతా వెదికినట్లుగా వుంది మీ వ్యవహారం. మా చింతారెడ్డిపాలెం నుండి జమాజెట్టీల్లాంటి నలుగురు మేస్త్రీలను పంపిస్తాను... దీనికి ఇంజనీర్లు పల్లేదు. సినిమా డైరెక్టర్లు అక్కర్లేదు... సంవత్సరం లోపు మీకు ఎట్ట కావాలంటే అట్లా బిల్డింగ్‌లు కట్టేస్తారు. వాళ్లకు ఇంజనీరింగ్ ప్లాన్‌లు కూడా పల్లేదు. కావాలంటే మన నారాయణను అడగండి... ఆయన కాలేజీ బిల్డింగ్‌లన్నీ కట్టింది వాళ్లే కదా. ఆ సింగపూర్, జపాన్ వాళ్లు అంతకంటే బాగా కడతారేంటి, కావాలంటే నారాయణనే మళ్లీ అడగండి అని అన్నాడు. అప్పుడు నారాయణ వుండి ... అవును సార్, నిజమే, మా చింతారెడ్డిపాలెం వాళ్ళే బ్రహ్మాండంగా కడతారు. మీరు జపాన్, సింగపూర్ అంటూ వుంటే, మీ అభిప్రాయాన్ని ఎందుకు కాదనాలని ఇంతకాలం చెప్పలేదన్నాడు. ఇంతకాలం వజ్రాలను పక్కనపెట్టుకుని గులకరాళ్ల కోసం విదేశాలకు పరుగులు తీసానన్నమాట... వెంటనే నెల్లూరు మేస్త్రీలను పిలిపించి పనులు మొదలు పెట్టించండంటూ చంద్రబాబు ఆనందంగా లేచాడు.

## కల్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు మెడిద్ది జనార్ధన్ రెడ్డి - ప్రవీణల కుమార్తె **అనూషా రెడ్డి - సుమంత్ రెడ్డి** (కోవూరు వాస్తవ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి - పద్మజల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 14వ తేది నెల్లూరులోని పి.వి.ఆర్. కళ్యాణ మండపము నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు

# తలాతోకా లేని ట్వీట్టర్ పిట్ట

(మొదటి పేజి తరువాయి)

ఆయన ఎంచుకుంటున్న అంశాలు ఆయన స్పందిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. ఆయన వల్ల ఏమికాదు ఏదీ ఒరగదు అనే నిర్లిప్త భావం ఏర్పడుతుంది. ఆయన ఏం మాట్లాడుతున్నాడో దేనికి స్పందిస్తున్నాడో ఎందుకు సమాధానమిస్తున్నాడో ఎవరిపై పోరాడుతున్నాడో ఎవరిపై విమర్శలు చేస్తున్నాడో ఎవర్ని నిలదీస్తున్నాడో ... అన్నీ అంతులేని ప్రశ్నలే. అర్ధం లేని వ్యవహారాలే. ఇల్లు కాలి బూడిదయ్యాక ఫైరింజన్ వచ్చినట్లు ఆకలికి అల్లాడినవాడు సచ్చినాక ప్యారడైజ్ బిరియాని తెచ్చినట్లు పవన్ కూడా ఎప్పుడో తెరమరుగైన సమస్యల్ని ఇప్పుడు నెత్తికెక్కిచ్చుకుంటున్నాడు. వాటికి సమాధానం చెప్పండంటూ ట్విట్టర్‌లో ట్వీటుతున్నాడు.

దేశమంతా పెద్ద నోట్ల రద్దుతో గందరగోళంగా వుంది. దీనిపై ఏమాత్రం పవన్ స్పందించలేదు. ఎప్పుడో తెరమరుగైన రోహిత్ వేముల ఆత్మహత్య, గోవధ వంటి అంశాలపై మాత్రం ఆయన ట్విట్టర్‌లో బిజెపిని ప్రశ్నించారు. ఇవి విభిన్నవర్గాల ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశాలు. ఎవరి వాదనలు వారికుంటాయి. వీటిమీద జరగాల్సిన రచ్చఅంతా జరిగిపోయింది. మళ్ళీ దీనిని గెలకడం పవన్‌కు సరదాలాగుంది. ఆంధ్రప్రదేశ్‌లో బొచ్చిబోలెడు సమస్యలున్నాయి. రాష్ట్రమంతా అవినీతిమయమయింది. అధికార పార్టీనేతల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. రైతులకు సాగునీరు లేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పెండింగ్‌లో వున్నాయి. విదేశీయాత్రలు, పుష్కరాలు, రాజధానిపేరుతో వందలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. ప్రజాసంక్షేమ పథకాలు అటకెక్కాయి. సెజ్‌లపేరుతో రాష్ట్రవ్యాప్తంగా భూదోపిడీ జరుగుతుంది. ఇక రాజధానిపేరుతో జరుగుతున్న అక్రమాలకు లెక్కేలేదు. తన రాష్ట్ర ప్రజలు ఇబ్బందిపడుతున్నా ఈ సమస్యలపై పవన్ ప్రశ్నించకుండా స్పందించకుండా జనం మర్చిపోయిన సమస్యలను నెత్తికెత్తుకొని ఊరేగడం చూస్తుంటే ఆయన హీరోనా లేక కామెడీ యాక్టరా అనే అనుమానం కలుగుతుంది.

# ఆంధ్రమహిళా మండలికి నూతన భవనం



గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళా మండలి ద్వారా పేదలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వర్తి స్తున్న భవనం శిథిలావస్థకు చేరు కోవడంతో, నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. బుధ వారం ఆమె గూడూరులోని ఆ మహిళామండలి భవనం ప్రాంగణంలో మండలి సభ్యులతో కలసి, అధ్యక్షురాలు మాగుంట సుదర్శనమ్మ తదితరులతో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి ప్రతినిధులు మాట్లాడుతూ, 1945లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందని, అందువల్ల ఆ భవనాన్ని తొలగించి నూతనంగా నిర్మించాలని తీర్మానించామన్నారు. ఆ నిర్ణయం మేరకు పాత భవనాన్ని తొలగిస్తుంటే, గిట్టనివారు కొందరు లేనిపోని దుష్ప్రచారాలు చేయడం సబబు కాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్ర మహిళా మండలి సభ్యులు పి.ప్రభ, శ్రీలక్ష్మి, సీతారెడ్డి, సౌందర్యమ్మ, స్వర్ణమ్మ, లక్ష్మి, దేవకి, యారం మంజుల, వై. స్నేహలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 27న ఓ.సి విద్యుత్ ఉద్యోగుల 'చలో ఏలూరు'

రిజర్వేషన్ల అమలు తీరుపై ఓ.సి ఉద్యోగుల్లో పెరుగుతున్న అభద్రతాభావాన్ని ప్రతిబింబిస్తూ ఓ.సి విద్యుత్ ఉద్యోగ సంఘం ఈ నెల 27న ఏలూరులో జరుపుతున్న డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఓసి విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జె.కృష్ణప్రసాద్, కె.శ్రీనివాసులురెడ్డి, డిస్కమ్ నాయకుడు కె. ప్రభాకర్, జిల్లా నాయకులు ఎ.సోమశేఖరరెడ్డి, బి. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, నేటి సమాజంలో రిజర్వేషన్ల వల్ల ఓ.సి ఉద్యోగులకు కలుగుతున్న తీవ్ర అన్యాయాన్ని ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అలాగే ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు కారణంగా వ్యవస్థలో ప్రతిభకు అన్యాయం జరుగుతోందన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయకపోవడం వల్ల ఉన్నత పదవుల్లో అన్ని వర్గాలకీ ప్రాతినిధ్యం లేక సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అందరిలో అవగాహన కలిగించే దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

# అభివృద్ధికి దూరంగా కావలి రైల్వేస్టేషన్



కావలి రైల్వేస్టేషన్ సుమారు 300గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యంగా ఉపయోగపడు తుంది. నిత్యం సుదూర ప్రాంతాలైన బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్ళేందుకు కేంద్రంగా వుంది. మరోప్రక్క వస్త్రరంగం వ్యాపారులు నిత్యం వందల సంఖ్యలో దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మొత్తంమీద సంవత్సరానికి 9కోట్ల రూపాయల రాబడి వస్తుంది. కానీ అన్నీఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కావలి రైల్వేస్టేషన్ లో సదుపాయాల కల్పనలో, కీలకమైన రైళ్ళు నిలుపుదలలో సవతి తల్లి ప్రేమను చవిచూస్తుంది. పాలకులు, ఉన్నతాదికారులు పట్టించుకోకపోవడమే ఈ పరిస్థితికి కారణం. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న కావలి బి గ్రేడ్ లోనే ఉన్న విషయాన్ని కావలి వాసి, డిఆర్‌యుసిసి సభ్యుడు కామయ్య గుర్తించే వరకు ఈ ప్రాంత పాలకులకు తెలియదు. తుని, తాడేపల్లిగూడెం, అనకాపల్లి వంటి చిన్న రైల్వే స్టేషన్‌లు ఎ గ్రేడ్‌లో వుండడం, మరో ప్రక్క తక్కువ జనాభా, స్వల్పరాబడిని ఇస్తున్న అన్నవరం, నిడదవోలు, శింగరాయకొండ, పాలకొల్లు, గుడివాడ వంటి బి గ్రేడ్ స్టేషన్‌ల సరసన కావలి రైల్వే స్టేషన్‌ను నిలపడం దారుణం. ఫలితంగా బడ్జెట్ కేటాయింపులలో కావలికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. కావలి స్టేషన్‌లో చిన్న సమస్యలు పరిష్కారం కావాలన్నా బి గ్రేడ్ లో ఉండటం వలన నిధులు మంజూరుకావడం లేదు. ముఖ్యంగా పాదచారుల వంతెన 2వ నెంబర్ ఫ్లాట్‌ఫారం మీదకే నిర్మించారు. స్టేషన్ పడమర వైపు నుండి పెద్ద ప్రాంతాలైన జనతాపేట, వైకుంఠపురం, వెంగళ్‌రావునగర్ లతోపాటు ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల ప్రజలు స్టేషన్‌లోకి రావాలంటే 1వ నెంబర్ ఫ్లాట్‌ఫారం దాటుకొని రావలసి వస్తుంది. ఇక్కడ రైలు పట్టాలు దాటుకుని రావడం, లూప్ లైన్‌లో ఆగిన రైళ్ళ క్రింద దూరి రావడం వలన అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. పాదచారుల వంతెన పొడిగింపు, పడమటివైపు టిక్కెట్‌బుకింగ్ కౌంటర్ ఏర్పాటుచేయాలని చాలా కాలంగా కోరుతున్నారు. అదేవిధంగా మరుగుదొడ్ల సమస్యతో సతమతం అవుతున్నారు. మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు. పాదచారుల వంతెన ఎక్కలేక వృద్ధులు, వికలాంగులు నానా అవస్థలు పడుతున్నారు. వీరికి స్టేషన్‌లో ఎక్స్‌లేటర్(లిఫ్ట్) ఏర్పాటుచేయాలని వారు విజయవాడ-ఒంగోలు, తిరుపతి-నెల్లూరు,చెన్నై-నెల్లూరు వరకు తిరిగే మెమో పాసింజర్ రైళ్లును కావలి వరకు పొడిగించాలని ముఖ్యంగా కోరుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే.. నెల్లూరు, ఒంగోలు వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాల్సివస్తుంది. భారీగా ఆదాయాన్ని సమకూర్చే కావలిలో యశ్వంత్‌పూర్, శబరి, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని దశాబ్దాలుగా కావలి వాసులు కోరుతున్నారు. రైల్వే మంత్రులు, ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేస్తూనే ఉన్నారు. కానీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు పట్టుబట్టి ఒక్కరైలైనా నిలుపుదల చేయాలని కోరడంతో శేషాద్రిని నిలుపుదల చేయించారు. కానీ మిగిలిన రైళ్ల నిలుపుదల చేయాలంటే.. మళ్ళీ ఎన్ని సంవత్సరాలు పడుతుందోనని కావలి వాసులు వాపోతున్నారు.




### 'ఎ' కేటగిరి హోదాకు పోరాటం చేస్తా....! కుందుర్తి కామయ్య, డీఆర్‌యూసీసీ సభ్యుడు

తాను డీఆర్‌యూసీసీ సభ్యునిగా ఎన్నికయ్యాక... కావలి రైల్వేస్టేషన్‌లోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిల ద్వారా రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. విజయవాడలో జరిగిన డీఆర్‌యూసీసీ సమావేశంలో కావలి 'బి' కేటగిరిలో ఉన్నట్లు తెలిసింది. అందుకే నిధులు కేటాయింపులో అన్యాయం జరుగుతుందని గుర్తించాను. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్లా. వారి ద్వారా ఏకేటగిరిగా కావలి రైల్వేస్టేషన్ ను చేసేందుకు నా శాయశక్తుల కృషిచేస్తా. అదేవిధంగా పాదచారుల వంతెన, టిక్కెట్‌బుకింగ్ కేంద్రం ఏర్పాటుకు విజయవాడ డీఆర్‌ఎం అశోక్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు షిపాలిలు సానుకూలంగా స్పందించారు. వీటి నిర్మాణం కోసం బడ్జెట్‌లోనూ నిధులు కేటాయిస్తామని వారు తెలిపారు. మిగిలిన సమస్యలు ప్రాధాన్యప్రకారం చేస్తామని వారు హామీనిచ్చారు.

# సామాజిక సేవలు హర్షణీయం.




నేటి సమాజంలో వ్యక్తిగత వ్యాపారాలే కాకుండా సామాజిక సేవలు కూడా అవసరమని అలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యుల సేవలు హర్షణీయమని కావలి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. పట్టణంలోని కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నేరెళ్ళ గురుప్రసాద్ అధ్యక్షతన అపోలో స్పెషాలిటీ హాస్పటల్స్ డాక్టర్లచే మెగా ఉచ్చిత వైద్యశిబిరాన్ని నిర్వహంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ది కావలి కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ వెల్‌ఫేర్ అసోషియేషన్ వారి సహకారంతో నెల్లూరు ప్రముఖ వైద్యులచే సుమారు 500 మంది రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా చేయించి మందులను పంపిణీ చేశామన్నారు. అలాగే రోగులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించామన్నారు. ముందు ముందు అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకట సత్యన్నారాయణ, పట్టణ ప్రముఖులు గ్రంధి యానాధిశెట్టి, కనుమర్లపూడి వెంకటనారాయణ, తిరువీధి ప్రసాద్, తన్నీరు మాల్యాద్రిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనుమాలశెట్టి శివయ్య, మధుసూధనరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు మార్గదర్శకం.. 'వ్యాసమంజరి'

– ఆవిష్కరణోత్సవంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి



సమాజ శ్రేయస్సును కోరుతూ రాసే మంచి రచనలే అందరికీ మార్గదర్శకంగా వుంటాయని, నెల్లూరు కవి గ్గరపు రాధాకృష్ణమూర్తి రచించిన 'వ్యాసమంజరి' కూడా అలాంటి కోవకే చెందిందని, ఇలాంటి మంచి రచనలెన్నో ఇంకా వెలుగులోకి రావాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణ మూర్తి రచించిన 'వ్యాసమంజరి' పుస్తకాన్ని ఈ నెల 17న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. నెల్లూరు టౌన్‌హాలులో పెన్షనర్ల దినోత్సవంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'వ్యాసమంజరి' పుస్తకావిష్కరణ ఎంతో ఘనంగా జరిగింది. ఆవిష్కరణ అనంతరం రచయిత బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు అభినందించి సత్కరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ 'వ్యాసమంజరి'ని సమీక్షిస్తూ, ఇందులోని వ్యాసాలు సమాజానికి ఎంతో ఉపయుక్తమైనవని ప్రశంసించారు. అందులోనూ వివిధ పత్రికల్లో బహుమతులందుకున్న తన వ్యాసాలన్నిటినీ కలిపి ఒక సంకలనంగా; 'వ్యాసమంజరి' పేరుతో పుస్తకరూపంలోకి తీసుకురావడం ఎంతైనా అభినందనీయమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఈ వ్యాసాలు మార్గదర్శకాలని వక్తలందరూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం. రామచంద్రరావు, చదలవాడ వెంకటశేషయ్య, ఎం.వి కృష్ణయ్య, ఎ.హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సాహితీ వేత్త చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఆచార్య ఆదిత్య, చిన్ని నారాయణరావు, డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు ఈ సందర్భంగా రచయిత బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని అభినందించారు.

# పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' ఇవ్వాలి

అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న అవార్డు ఇవ్వాలని అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షుడు కెవి చలమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15న అమరజీవి పొట్టి శ్రీరాములు 64వ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు మాట్లాడేవారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు అవిశ్రాంత దీక్ష చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయుని త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్రమని అన్నారు. అయితే, నవంబర్ 1వ తేదీన ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాలు నిర్వహించకపోవడం ఎంతో దురదృష్టకరమన్నారు. రాష్ట్రప్రభుత్వం పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర శాసనసభ ఆవరణలో నెలకొల్పాలని, పార్లమెంట్ ఆవరణంలోను పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయాలని, శాసనసభ – పార్లమెంట్ హాల్స్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలు ఏర్పాటు చేయాలని కోరారు. అమరజీవి త్యాగాన్ని.. ఆశయాలను అందరూ సదా గుర్తుంచుకునేవిధంగా పొట్టి శ్రీరాములు జయంతి–వర్ధంతి రోజులను సెలవు దినాలుగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


# అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలి

– ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్

జిల్లాలో స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డు కింద ప్రారంభించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్ అన్నారు. మంగళవారం స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డ్ కార్యక్రమంపై ఆయన గ్రీవెన్స్‌సెల్ హాలులో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సమావేశానికి ఓజిలి మండలం కర్రబల్లవోలు, గూడూరు మండలం నెర్నూరు, టిపి గూడూరు, ఆత్మకూరు మండలంలోని మహిమలూరు, ఎఎస్‌పేట మండలంలోని చిరమన గ్రామాలకు సంబంధించి స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డ్ అభివృద్ధి పనుల స్థితిగతులను చర్చించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందని ఆయన



అధికారులకు సూచించారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి డిప్యూటి డైరెక్టర్ వెంకయ్య మాట్లాడుతూ, ఈ పథకాల కింద ఎంపికైన గ్రామాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించాలన్నారు. ఒడిఎఫ్ కింద మరుగుదొడ్లను నిర్మాణంతో పాటు వాటిని ప్రజలు వినియోగించుకునేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, తహశీల్దారులు పాల్గొన్నారు.





# అమ్మ
# జీవితం హిస్టరీ... మరణం మిస్టరీ !

ఈ భూమ్మీద పడ్డ తొలిరోజుల్లో జయరామన్ కోయల వల్లి... పసిప్రాయంలో సినిమాల్లో చేరాక జయరామన్ జయలలిత... సినిమాలు వదిలి రాజకీయాల్లోకి వచ్చాక పురచ్చితలైవి జయలలిత... తమిళనాడు సిఎం అయ్యి అనేక ప్రజాసంక్షేమ పథకాలు చేపట్టాక అమ్మ జయ లలిత... మనిషి ఒక్కరే, కాని పేర్లు మారాయి. పదవులు మారాయి. ప్రజల మనసుల్లో, ఆలోచనల్లో, వారి భావాల్లో ఆమె స్థానం మారుతూ వచ్చింది. ఒక భర్తకు భార్య కాలేకపోయినా, ఒక బిడ్డకు అమ్మ కాలేకపోయినా కోట్లాదిమంది ప్రజల చేత అమ్మ అని పిలిపించుకున్న భాగ్యం బహుశా చరిత్రలో మథర్‌థెరిస్సా తర్వాత జయలలితకే దక్కిందేమో! జయలలిత... ఒక పేరు కాదు ఒక చరిత్ర! నడిచిన చరిత్ర... నడుస్తున్న చరిత్ర కూడా!

నిజంగా ఆమె జీవితం ఒక హిస్టరీనే! ఎందుకంటే ఆమె తండ్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలా ప్రధా ని కాదు, షేక్ అబ్దుల్లాలా ముఖ్యమంత్రి కాదు. కాబట్టి ఆమెకు రాజకీయ నేపథ్యం వారసత్వంగా రాలేదు. ఫ్రీగా రాలేదు. పోరాడితే వచ్చింది. ఆమె తన జీవితంలో తండ్రి ఎలా ఉంటాడో చూడలేదు. అలాగే బిడ్డనూ చూసే అదృష్టం దక్కలేదు. కాబట్టి ఆమె జీవితంలో ఆ రెండుపాత్రలకు స్థానం లేకుండా పోయింది. తన వ్యక్తిగత జీవితంలో ఆమె అతి దగ్గరగా చూసిన పాత్ర అమ్మ. ఆ పాత్ర నుండే ఆమె ప్రేమను పొందింది. అందులోని మాధుర్యాన్ని చవిచూసింది. కాబట్టే తన జీవితంలోనూ అమ్మపాత్రను అద్భుతంగా మలచుకుని కోట్లాదిమందికి 'అమ్మ'లా మారింది. తన సినిమా, రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసినా, ఆమెకు మిగిలింది, ఆమె జీవితానికి పరిపూర్ణత చేకూర్చింది ఆమె కనుమూసిందని తెలియగానే అమ్మా, అమ్మా అంటూ రోదించిన కోట్ల గొంతుల్లోని వేదనలే!

తన జీవితాన్నే ఒక హిస్టరీగా మలచిన ఈ 'అమ్మ' మరణం మిస్టరీ కావడం విశేషం. చావుపుట్టుకలు మానవజీవితంలో సహజమే అయినా ఆమె మరణంలోని కొన్ని అసహజ సంఘటనలే అనుమానాలకు తావిస్తున్నాయి. ఆమె మరణంపై అనుమానాలు లేవనెత్తుతూ కొందరు ఏకంగా ప్రధానమంత్రికే లేఖలు వ్రాసే స్థాయికి పరిస్థితి చేరింది. తీవ్రమైన జ్వరం, డీహైడ్రేషన్‌తో ఆసుపత్రిలో చేరిన మనిషి మృతదేహంగా బయటకు రావడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు ఉగ్రవాద ఘాతుకానికి బలయ్యారు. వై.యస్.రాజశేఖరరెడ్డి లాంటి నేత హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఇవి వూహించని మరణాలు. హఠాత్తుగా గుండెపోటు రావడంతో మరణించడం వేరు. క్యాన్సర్ లాంటి వైద్యం లేని వ్యాధులతో మరణిస్తే ఆ సంగతి వేరు! కాని జయలలిత విషయం అది కాదు. ఆమె మరణంలో బి.పి, షుగర్‌లు ప్రధానపాత్ర పోషించాయి. ఇవి కంట్రోల్‌లో లేకపోవడం వల్లే ఆమెలో మూత్రపిండాలు, కిడ్నీ, కాలేయం వంటి సమస్యలు ఉత్పన్న మయ్యాయి. ఆసుపత్రిలో వుండగా తీవ్రమైన గుండెపోటుకు కారణం కూడా షుగర్, బిపిలే! మరి ఒక ముఖ్యమంత్రికి బి.పి, షుగర్‌లు కంట్రోల్ చేయలేనంతగా తమిళనాడు ప్రభుత్వ వైద్య విభాగం అధ్వాన్నస్థితిలో వుందా? లేక ఎవరైనా కావాలనే ఆమెలో బి.పి, మధుమేహం స్థాయిని పెంచారా? ఇవి సమాధానాలు చిక్కని ప్రశ్నలుగా మారాయి. అదీగాక జయలలిత వయసు కూడా అంత పెద్దదేం కాదు. 68ఏళ్లు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటుంటే, ఆహార అలవాట్లు అన్నీ నియంత్రణలో వుంటే ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకుని వుండొచ్చు. ఒకవేళ సీఎంగా జయలలిత తీరికలేని పనిలో వున్నా ఆమె బాధ్యత చూసుకునే వాళ్లు ఆమె ఆరోగ్యం పట్ల శ్రద్ధపెట్టి ఉండాలి. కాని ఎవరు కూడా ఆమె ఆరోగ్యంపై అంత శ్రద్ధ పెట్టలేదనే అనుమానాలున్నాయి.

ఈ ఏడాదిలో జరిగిన ఎన్నికలకు ముందే ఆమె ఆరోగ్యంపై అనేక వదంతులువచ్చాయి. ఎన్నికలలోనూ ఆమె చాలా తక్కువ సభల్లోనే పాల్గొన్నారు. ఎన్నికల నాటికే ఆమె భారంగా నడిచే వారు. అంతలా ఆమె ఆరోగ్యం దెబ్బతింటుంటే పక్కన వున్నోళ్లు పట్టించుకోకపోవడం శోచనీయంగా తోస్తుంది.

జయకు చిన్నప్పుడే తండ్రి చనిపోగా, సినిమాల్లో ఉండగానే తల్లి చనిపోయింది. ఆ తర్వాత ఆమె బంధువులకు దూరంగా పెరిగింది. ఒక దశలో సోదరుడు జయకుమార్ కుటుంబాన్ని పొయెస్ గార్డెన్‌లోనే పెట్టుకుంది. కాని అక్కడ జయ నెచ్చెలి శశికళ ఆధిపత్యం దెబ్బకు జయకుమార్ కుటుంబం అక్కడనుండి బయటకొచ్చేసింది. అప్పటి నుండి కుటుంబసభ్యులెవరూ ఆమెకు దగ్గరగా లేరు. 30ఏళ్లుగా శశికళ, ఆమె బంధువులు మాత్రమే జయను చుట్టుముట్టి వున్నారు. ప్రభుత్వ వ్యవహారాలలోనూ వీరిదే కీలకపాత్ర. శశికళ కోటరీ మితిమీరిన జోక్యం వల్ల తమిళనాడుకు రావాల్సిన కొన్ని పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయని, ఇది తెలిసి జయలలిత కొంతకాలం శశికళను దూరం పెట్టారని తెలుస్తోంది. అయితే ఆ తర్వాత శశికళ క్షమాపణ చెప్పడంతో జయ ఆమెను దగ్గర చేర్చుకున్నా, బంధువర్గాన్ని మాత్రం రానీయలేదు. శశికళ భర్త నటరాజన్‌ను కూడా పొయెస్ గార్డెన్‌లోకి అడుగుపెట్టనీయలేదు. ఒకటైంలో ఇంట్లో వంటమనిషి దగ్గర నుండి ప్రతిఒక్కరూ శశికళ మనుషులే వుండేవాళ్లు!

పొయెస్ గార్డెన్‌ను ఇంతలా అల్లుకుపోయిన శశికళ తనకు తాను కలలో కూడా వూహించనంతటి జీవితాన్ని అందించిన జయ ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తుంటే, నడవలేని పరిస్థితి దాకా వస్తే ఎందుకు ఉపేక్షిందనే అనుమానాలు లేకపోలేదు. జయలలిత తలచుకుంటే విదేశాలకు వెళ్లి వైద్యచికిత్స చేయించుకుని ఉండొచ్చు. వ్యాధి అంత ముదిరే దాకా ఎందుకు రానిచ్చారన్నదే ప్రశ్న!

ఇక అపోలో ఆసుపత్రిలో చేర్చిన తర్వాత అక్కడి వైద్యులు తమ శాయశక్తులా ఆమెకు వైద్యసేవలందించారు. ఒక దశలో కోలుకుందని ఆనందపడ్డా, ఆ తర్వాత గుండెపోటు రూపంలో మృత్యువు ముంచుకొచ్చి జయలలితను ఈ లోకం నుండి తీసుకుపోయింది.

అయితే జయలలిత మరణం తర్వాత శశికళ బంధువర్గమంతా మళ్ళీ ఆమె మృతదేహం చుట్టూ మూగింది. జయ దూరంగా పెట్టిన నటరాజన్ తిరిగి పొయెస్ గార్డెన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ప్రాణ స్నేహితురాలి మృతదేహం పక్కనే శశికళ రాజకీయ పావులు కదిపింది. స్నేహితురాలు లేదనే బాధకంటే కూడా అన్నాడిఎంకె పార్టీని తన చేతుల్లోకి తీసుకోవాలని, తన మనిషిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న తపనే ఎక్కువుగా కనిపించింది. దీంతో స్వతహాగానే అనుమానాలు తలెత్తాయి. అన్నాడిఎంకె న్యాయవ్యాది కృష్ణమూర్తి, జయ మేనకోడలు దీపా జయకుమార్ ఆరోపణలు చేసినా, తెహల్కా డాట్‌కామ్ ప్రత్యేక కథనాల్ని వెల్లడించినా, సినీనటి గౌతమి జయమృతిపై అనుమానాలు తేల్చాలంటూ ప్రధానికి లేఖ వ్రాసినా... ఇవన్నీ జయ మృతిలో శశికళ పాత్ర ఏంటో తేల్చాలని డిమాండ్ చేస్తున్నవే! జయ జీవితం భావితరాలకు హిస్టరీగా మిగిలిపోవాలేగాని, ఆమె మరణం ఒక మిస్టరీగా మారకూడదనే ఉద్దేశ్యమే వీరి ఆందోళనలల్లో కనిపిస్తోంది.

## బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మికోపన్యాసాలు



ఆర్ష విద్యాప్రవీణ, సమన్వయ సరస్వతి బ్రహ్మశ్రీ సామవేదంషణ్ముఖశర్మచే శుక్రవారం నుంచి ఈ నెల 27వ తేది వరకు ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల దాకా నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కళ్యాణమండపంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటుచేస్తున్నామని శివభక్త బృందం కన్వీనర్, కార్యక్రమ నిర్వాహకుడు డా. బి.శివప్రతాప్‌రెడ్డి, కుర్తాళం పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ తెలిపారు. దర్గామిట్టలోని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కలియుగ ప్రత్యక్షదైవం, భక్తుల కొంగుబంగారం శ్రీ వేంకటేశ్వరస్వామి లీలలు-మహాత్మ్యాల గురించి బ్రహ్మశ్రీ షణ్ముఖశర్మ ప్రవచిస్తారని పేర్కొన్నారు. ఉపన్యాసాల ముగింపు కార్యక్రమం సందర్భంగా 27వ తేది ఉదయం 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో శివశక్తి బృందం సభ్యులు చంద్రశేఖరశర్మ, ఆడిటర్ సురభి శివకుమార్, టివి కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com